ప్రజాశక్తి

శనివారం 13 మే 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పి

సిఎం పర్యటనకు పటిష్ట భద్రత

బాపట్ల జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి - నిజాంపట్నం,బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా నిజాంపట్నంలో ఈనెల 16న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్ట భద్రత చర్యలు చేపట్టాని బాపట్ల ఎస్‌పి వకూల్ జిందాల్ అధికారులకు సూచించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలకు, పోలీస్ సిబ్బందికి తాగునీరు ఎప్పటికప్పుడు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్ఆర్ మత్స్యకార భరోసా నగదు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి ముఖ్య మంత్రి నిజాంపట్నం వస్తున్నట్లు ఎస్‌పి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రత చర్యల పై పోలీస్ అధికారులతో ఎస్‌పి శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ హెలిపాడ్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతం, ముఖ్యమంత్రి ప్రసంగించే సభా వేదిక నిర్మాణం, మీటింగ్ ప్లేస్‌లో గ్యాంగ్ వేలు, బారికేడ్లు ఏర్పాటు, పార్కింగ్ ప్రదేశాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కాన్వాయ్ వెళ్లే మార్గంలో, సభా ప్రాంగణం, ప్రవేశ మార్గాలు, ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాల ఏర్పాట్లు, భద్రత పరమైన ఏర్పాట్ల గురించి ఎస్‌పి పోలీస్ అధికారులతో సమీక్షించారు. ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాటు పనులను పర్యవేక్షించడానికి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులను నియమించినట్లు తెలిపారు. వారి

▶ 2లో

కార్పొరేటర్ల కొంగొత్త 'ఆశ'

- మరోసారి స్టడీ టూర్‌కు సిద్ధమవుతున్న వైసిపి కార్పొరేటర్లు
- గతంలో ఓసారి స్టడీ టూర్ వెళ్లేందుకు ట్రావెల్ ఏజన్సీకి రూ.33 లక్షల చెల్లింపు
- టూర్‌కు ముందే మృతి చెందిన కాంట్రాక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

నలుగురు నవ్విపోదురు గాక...నాకేటి సిగ్గు...అన్నట్లుగా ఉంది ఒంగోలు నగరంలో అధికార పార్టీ కార్పొరేటర్ల తీరు. ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో చొరవ చూపని నేతలు అధ్యయన యాత్రల పేరుతో ప్రజా ధనాన్ని ఖర్చు చేసుందుకు ఉవ్విళ్లూరుతున్నారు. అసలే అంతంతమాత్రంగా ఉన్న నగరపాలక సంస్థ ఆర్థిక పరిస్థితులను కూడా లెక్క చేయకుండా జనం సొమ్ముతో జల్సా చేయాలని నిర్ణయించారు. గతంలో టూర్‌కు వెళ్లకుండానే ట్రావెల్ ఏజన్సీకి ముందస్తు డబ్బులు చెల్లించిన అధికారులు, ఈసారి కూడా నేతల అడుగులకు మడుగులొత్తేందుకు సిద్ధమయ్యారు.

అసలేం జరిగిందంటే....

దేశంలోని వివిధ రాష్ట్రాలలో ఉన్న పట్టణాలను సందర్శించి, అక్కడ పట్టణాల అభివృద్ధికి తీసుకంటున్న చర్యలు, సుందీరకరణ విషయాలు తెలుసుకునేందుకు నగరపాలక సంస్థ కార్పొరేటర్లు అధ్యయన యాత్రకు

ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయం

వెళ్లాలని ఆరు నెల క్రితం నిర్ణయించారు. దీనికి విజ్ఞాన యాత్ర అని పేరు పెట్టారు. ప్రతిపక్ష టిడిపి కార్పొరేటర్లు ఆరు మంది, జనసేన పార్టీ కార్పొరేటర్ ఒకరు అధికార పక్షం నిర్ణయాన్ని వ్యతిరేకించి తాము టూర్‌కు రామని చెప్పారు. అధికారపక్షంలో కూడా ఒకరిద్దరు రామని చెప్పారు. అధికార పక్షంకు చెందిన కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులతో కలిపి 43మంది టూర్‌కు వెళ్లేలా పథక రచన చేశారు. ఢిల్లీ, నైనటాల్, ముస్సోరి, అమృత్‌సర్ లాంటి నగరాలను సందర్శించే విధంగా 12 రోజుల పర్యటనకు సిద్ధమయ్యారు. మొదట్లో ఈ టూర్ వాయిదా పడింది. రెండోసారి ఎంఎల్‌సి ఎన్నికల్ కోడ్ కారణంగా ఆగిపోయింది. మూడోసారి ఈఏడాది మార్చి 18న వెళ్లడానికి అన్నీ ఏర్పాట్లు చేశారు. ట్రావెల్ ఏజన్సీ కాంట్రాక్టర్ హఠాన్మరణం చెందారు. దీంతో కార్పొరేటర్ల టూర్ ప్రోగ్రాం నిలిచిపోయింది.

ముందుస్తుగా డబ్బులు చెల్లించి..

కార్పొరేటర్ల టూర్‌కు సంబంధించి 43 మందికి 12 రోజులకు అవసరమైన ఖర్చులను రూ.33 లక్షలు నగరపాలక సంస్థ అధికారులు ముందుగానే కాంట్రాక్టర్‌కు చెల్లించారు. నెల్లూరుకు చెందిన ఆరిబిట్ టూర్స్ అండ్ ట్రావెల్ ఏజన్సీ వారికి డబ్బులు ఇచ్చేశారు. సాధారణంగా టూర్ ఏజన్సీ నిర్వాహకులు కార్పొరేటర్ల పర్యటన తరువాత బిల్లులు చెల్లించి డబ్బులు తీసుకోవాల్సి ఉంది.ఇక్కడ మాత్రం యాత్రకు వెళ్లకముందే రూ.33 లక్షలు డబ్బులు ఇచ్చేశారు. ఇప్పుడు కాంట్రాక్టర్ మరణించడంతో ఆ డబ్బులు ఎలా

▶ 2లో

ట్రూ అప్ షాక్..

- యూనిట్‌కు రూ.23 పైసలు పెంపు
- పేదలకు భారంగా మారిన విద్యుత్ ఛార్జీలు



ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ట్రూ అప్ పేరిట ప్రభుత్వం కరెంట్ ఛార్జీలు పెంచింది. 2023 ఏప్రిల్ నుంచి విద్యుత్ ఛార్జీలను పెంచాలని ఆదేశాలు జారీ చేసింది. యూనిట్‌కు సగటున రూ.23 పైసల చొప్పున పెంపుదల అనివార్యం కావడంతో ప్రభుత్వం పేద, ధనిక తారతమ్యం పాటించకుండా ట్రూఅప్ ఛార్జీల పేరుతో బాదేయడం పట్ల విమర్శల వర్షం కురుస్తోంది. విద్యుత్తు ఛార్జీలు అమాంతం పెరిగిపోతుండటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు పడితే అప్పుడు సర్దుబాటు ఛార్జీల పెంపుతో సామాన్య ప్రజల నెత్తిపై విద్యుత్తు బిల్లు గుదిబండలా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యర్రగొండపాలెం విద్యుత్తు సబ్ డివిజన్ పరిధిలోని యర్రగొండపాలెం మండల ంలో 16,066, పుల్లలచెరువు మండలంలో 10,153, త్రిపురాంతకం మండలంలో 13,781 కలిపి మొత్తం 40 వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ నెల ట్రూఆప్ ఛార్జీలు అన్ని క్యాటగిరీల వినియోగదారులపై భారం పడింది. ప్రతి ఒక్కరిపై రూ. 30 నుంచి రూ. వంద వరకు అదనపు భారం పడింది. ఇప్పటికే పెరిగిన ఛార్జీలతో ఇబ్బందులు పడుతున్న వినియోగదారులకు ఈ భారం మరింత అదనం కానుంది.

2014 నాటి భారం షురూ..

2014 నుంచి 2019 వరకు వచ్చిన ఆర్థిక నష్టాలను భర్తీ చేయడంలో భాగంగా ట్రూప్ ఛార్జీలను పెంచారు. 2022 ఆగష్టు నుంచి 2025 జులై వరకూ యూనిట్‌కు రూ. 23 పైసలు చొప్పున పెంచారు. 2025 జులై వరకు ప్రతి నెలా ట్రూఆప్ పేరిట అదనపు ఛార్జీలను వసూలు చేయనున్నారు. ట్రూఆఫ్ ఛార్జీలు పెంపుదల సామాన్యులను సమిదలుగా మార్చాయనే వాదన వినిపిస్తోంది. బిపిఎల్ కేటగిరీ కింద ఉన్న కుటుంబాలకు కూడా ఛార్జీల పెంపుదల నుంచి మినహాయించకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది.

గత పెంపుదలకు భిన్నంగా..

గతంలో కరెంట్ ఛార్జీల పెంపునకు భిన్నంగా ఇప్పుడు ఛార్జీలను పెంచింది. గతంలో కరెంటు ఛార్జీల పెంప్పుడలను పరిశీలిస్తే శ్లాబ్ రేట్ల ప్రకారం పెంచేవారు. దీన్నిబట్టి గమనిస్తే పేదల విద్యుత్ వినియోగం పరిమితం. దీన్నిబట్టి పేదలపై భారం పరిమితంగానే ఉండేది. ట్రూఆఫ్ చార్జీల విషయంలో పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా ఛార్జీల పెంపు అనివార్యమైంది. కమర్షియల్, విద్యుత్ కనెక్షన్లపై ట్రూప్ ఛార్జీలను వసూలు చేయడానికి బదులుగా కరెంటు కనెక్ష న్లన్నింటికీ ఛార్జీలను పెంచడంపై విమర్శల వర్షం కురుస్తోంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో దళిత కాలనీల్లో ఓ బల్బును ఉచితంగా ఉపయోగించుకునే అవకాశం

▶ 2లో

చుక్కల భూములకు 22(ఎ) తొలగింపుతో

ప్రజలకు మేలు : కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

చుక్కల భూములను 22 (ఎ) నుంచి తొలగించడం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. చుక్కుల భూముల చిక్కులకు శాశ్వత పరిష్కారం' కార్యక్రమాన్ని నెల్లూరు జిల్లా కావలి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలోని లబ్ధిదారులకు కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో 1(బి) సర్టిఫికెట్లను కలెక్టర్ అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 37,615 ఎకరాల చుక్కల భూమి పేరుతో ప్రభుత్వ భూమి నిషేధిత జాబితాలో ఉందన్నారు. ఇలాంటి భూములను రిజిస్ట్రేషన్ చేయడం, తాకట్టు పెట్టుకోవడం, వెబ్ ల్యాండ్‌లో పేరు అప్‌డేట్ చేసుకోవడానికి అవకాశం లేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలైన రైతు భరోసా, పంట నష్టం పరిహారం ఈ భూములకు వర్తించవన్నారు. 2016 నుంచి ఇప్పటి వరకు రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో ఇలాంటి భూములను గుర్తించామన్నారు. 2016కు ముందు 12 సంవత్సరాలు సాగులో ఉండి దాని వివరాలు అడంగళ్లలో 1(బి)లో, పాత 1(ఎ) లో, పాతపట్టాలో పేరు

లబ్ధిదారులకు 1(బి) సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్

నమోదై ఉండి, వారికి ఎక్కడైనా రిజిస్ట్రేషన్ జరిగినా లేదా 1952 - 56 వరకు రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లో వాడిన రిజిష్టర్ ఆఫ్ హోల్డింగ్స్ అనే డాక్యుమెంట్ లో ఎక్కడైనా పట్టాదారు పేరు నమోదై ఉంటే ప్రయివేట్ పొలం పట్టా పొలాన్ని గుర్తించి ప్రభుత్వ నిషేధిత 22 (ఎ) నుంచి తొలగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రకాశం జిల్లాలోని 38 మండలాలలో రెవిన్యూ రికార్డులలో చుక్కల భూములుగా నమోదైన సుమారు 37,615 ఎకరాల భూమిని 'చుక్కల భూమి" రిజిస్ట్రేషన్ చట్టం-1908 లోని సెక్షన్-22ఎ(1)(ఇ) నుండి ప్రభుత్వం తొలగించిందన్నారు. తద్వారా జిల్లాలో సుమారు 25,052 కుటుంబాలకు సుమారు రూ.3 వేల కోట్ల విలువైన లబ్ధి. చేకూరిందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ కె. శ్రీనివాసులు, డిఆర్ఒ ఆర్.శ్రీలత, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ట్రూ అప్ షాక్

(మొదటి పేజీ తరువాయి)

కల్పించింది. ప్రస్తుత ప్రభుత్వం ఒక బల్బు ఉచిత విద్యుత్ వినియోగ పథకానికి తిలోదకాల్చింది.

సంపాదనలో సగం బిల్లుకే సరిపోతోంది

షేక్ చిన్నవలి, యర్రగొండపాలెం

సర్దుబాటు పేరుతో ప్రభుత్వం విద్యుత్తు ఛార్జీలు పెంచింది. ప్రతి వినియోగదారుడిపై అదనంగా భారం పడింది. ఇప్పటి వరకు ప్రతి నెలా రూ.600 విద్యుత్తు బిల్లు చెల్లిస్తున్నా. ఈ నెల విద్యుత్తు కరెంటు బిల్లు చూసి షాక్‌కు గురయ్యా. ఏకంగా రూ.900 బిల్లు వచ్చింది. ఒకేసారి రూ.300 పెరిగితే సంపాదించిన డబ్బంతా విద్యుత్తు ఛార్జీలకే సరిపోతుంది. పెంచిన సర్దుబాటు ఛార్జీలను వెంటనే తగ్గించాలి.

పెంచుతూపోతే చెల్లించడం ఎలా

టంగుటూరి సత్యనారాయణ, సిపిఎం కార్యదర్శి

విద్యుత్ ఛార్జీలకు సర్దుబాటు పేరుతో అదనంగా వసూలు చేయడం భావ్యం కాదు. దీంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసలే పనులు లేక పూట గడవని పరిస్థితుల్లో విద్యుత్ భారాలు మోపడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ బిల్లు ప్రతినెలా పెంచుతూ పోతే చెల్లించడం కష్టం. సర్దుబాటు ఛార్జీలను నిలిపివేసి విద్యుత్ చార్జీలను పెంచకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

సిఎం పర్యటనకు పటిష్ట భద్రత

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా పనులను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారుల తమ కేటాయించిన ప్రాంతాల్లో తీసుకోవాల్సిన ముందస్తు భద్రత చర్యలు చర్చించి పలు సూచనలు చేశారు. అనంతరం సభా ప్రాంగణం నుంచి హెలిపాడ్ వరకూ ఎస్‌పి కాలినడకన వెళ్లారు. సభా ప్రాగంణం, హెలిపాడ్ ప్రాంతాన్ని, పార్కింగ్ ప్రదేశాలను,సిఎం కాన్వాయ్ వెళ్ళు మార్గాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. అక్కడ కేటాయించిన అధికారులతో కలిసి గ్రౌండ్ లెవెల్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సమావేశంలో రేపల్లె డిఎస్‌పి టి.మురళీకృష్ణ, ఎఆర్ డిఎస్‌పి ప్రేమ్ కుమార్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ ఏ శ్రీనివాస్, రేపల్లె రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏ శివశంకర్, రేపల్లె సిఐ ఎస్ విజయచంద్ర, వేమూరు సిఐ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- తేమను సాకుగా చూపి రైతులకు నష్టం చేయొద్దు

- పంగులూరు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-పంగులూరు

ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా, తడిసిన మొక్కజొన్న పంటను ప్రభుత్వం కొనుగోలు చేసి, రైతాంగాన్ని నష్టాల బారి నుంచి ఆదుకోవాలని అద్దంకి శాసనసభ్యుడు గొట్టిపాటి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంగులూరు మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని, శుక్రవారం మొక్కజొన్న రైతులు, తెలుగుదేశం పార్టీ నేతలతో కలిసి ఆయన సందర్శించారు. రైతులను, మార్క్‌ఫెడ్ అధికారులను అడిగి జరిగిన పంట నష్టం, కొనుగోలు సరళిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ రైతుకు దన్నుగా నిలవాల్సిన ప్రభుత్వం నిబంధనల పేరుతో ఇష్టారీతిన వ్యవహరిస్తోందని అన్నారు. తడిసిన పంటలను కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని రవికుమార్ అన్నారు. తేమ శాతం లేకుండా ఆరబెట్టుకుని రావాలని అధికారులు నిబంధనలు విధిస్తుండటంతో, రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎలాంటి నిబంధనలు విధించకుండా ప్రతి గింజను కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. పంటల సాగు కోసం అప్పులు చేసి, పెట్టిన పెట్టుబడులు తీర్చే స్థితిలో లేక, మళ్లీ అప్పులు చేసే ధైర్యం లేక రైతన్నలు గుండె నిబ్బరం కోల్పోతున్నారన్నారు. ప్రభుత్వం నుంచి రైతులకు ఖచ్చితమైన హామీ ఇచ్చి, నష్టపోయిన రైతుల కన్నీళ్లు తుడవాలని, యుద్ధ ప్రాతిపదికన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, జరిగిన నష్టంపై సర్వేలు చేపట్టి, త్వరగా రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రవికుమార్ కోరారు. ఈ పంటతో సంబంధం లేకుండా ప్రతి పంటనూ కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గత నాలుగేళ్లలో ప్రకృతి వైపరీత్యాలతో 50 లక్షల ఎకరాలకు పైగా పంట నష్టం ఏర్పడితే, ఒక్క రైతును కూడా ఈ ప్రభుత్వం ఆదుకోలేదని రవికుమార్ అన్నారు. ఎన్నికలకు ముందు వేల కోట్ల రూపాయలతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తాం, పంట వేసే ముందే ఆ పంట ధర ప్రకటిస్తాం, పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని జగన్‌రెడ్డి నమ్మబలికి, ఇప్పుడు రైతుల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని అన్నారు.

జిల్లా కలెక్టర్‌తో చరవాణిలో మాట్లాడుతూ..

మొక్కజొన్న పంట నమోదు గడువు పెంచాలని, ఈ-క్రాప్, తేమ శాతంతో సంబంధం లేకుండా మార్క్‌ఫెడ్ ద్వారా పంటలు కొనుగోలు చేపట్టి, గిట్టుబాటు ధరలు కల్పించాలని బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను ఎమ్మెల్యే రవికుమార్ కోరారు. ఈ సందర్భంగా రవికుమార్ జిల్లా కలెక్టర్‌తో చరవాణిలో మాట్లాడారు. శనగ కొనుగోలు కేంద్రాలను మూసివేయడం తగదని, తిరిగి ప్రారంభించాలని, లేకపోతే దళారులు ఇష్టారీతిన రేట్లు తగ్గించి కొనుగోలు చేస్తారని, దీనివలన రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రవికుమార్ కలెక్టర్ రంజిత్‌బాషా దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రావూరి రమేష్ బాబు, మాజీ అధ్యక్షుడు కుక్కపల్లి ఏడుకొండలు, ఆరికట్లవారిపాలెం మాజీ సర్పంచి ఉన్నం రవి, అడ్డగిరి రాఘవులు, స్థానిక తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

కుర్చీలు బహూకరిస్తున్న క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బాబూరావు

బార్ అసోసియేషన్‌కు కుర్చీలు బహూకరణ

ప్రజాశక్తి-చీరాల: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చీరాల బార్ అసోసియేషన్ సభ్యులకు 10 ఆఫీస్ కుర్చీలను బహూకరించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఐ బాబూరావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలు అన్నివేళలా నిర్వహిస్తుందని, అందులో భాగంగా బార్ అసోసియేషన్‌కు కుర్చీలను అందించామని అన్నారు. రోటరీ సేవా కార్యక్రమాల పట్ల బార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు హేమంత్ కుమార్, కృష్ణమూర్తి సురేష్, రమేష్, బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకాశంజిల్లా ఫర్మినెంట్ ఫండ్ నిధి లిమిటెడ్,ఒంగోలు

Regd No : 01-24240

(Recognised by Government of India as a " NIDHI " Company)

D.No : 34-1-8, Opp.Old Govt.Hospital(Matha and Sisu Hospital)

Near District Court, ONGOLE - 523001, Prakasam District, A.P

బంగారు ఆభరణాల వేలం ప్రకటన

ఈ క్రింది ఉదహరించిన ఖాతాదారులు మా సంస్థ నందు బంగారు నగలు తాకట్టు పెట్టి అప్పు తీసుకొని తిరిగి చెల్లించమని నోటీసులు పంపిననూ తిరిగి చెల్లించని కారణంగా సంస్థ నిబంధనలు మేరకు తేది : 29-05-2023 సోమవారం మధ్యాహ్నం 3.00 గం.లకు మా సంస్థ ఆవరణములో బహిరంగ వేలం వేయబడును. వేలం వేసినా బాకి రద్దు కానియెడల వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొని మిగిలిన బకాయి వసూలు చేయబడును. ఈ దిగువ ఖాతాదారులు ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలం నోటీసు వర్తిస్తుంది. అప్పు నోటీసులు అందని వారికి మరియు నోటీసులు తిరస్కరించినవారికి పత్రికా ముఖమున చివరి సారిగా ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

వ.నెం.	లోన్‌ఖాతా నెం	ఋణగ్రహీతపేరు	అడ్రసు	స్థూలబరువు గ్రా.
1	27	పువ్వాడ స్వామి తండ్రి రోశయ్య,	డోర్ నెం 23-1-156 గాంధీ బొమ్మ దగ్గర గాంధీ రోడ్డు, ఒంగోలు,	3.1
2	72	జగన్నాథం మురళి మోహన్ తండ్రి ఇజ్రాయిల్,	7/1057,సుందరయ్యనగర్ సీతారామాంజనేయ ఆలయం, మంగమూరుడొంక, ఒంగోలు,	39.03
3	86	తంగిరాల సురేష్ తండ్రి కోటేశ్వరావు	కొమ్మినేని వారి పాలెం వయా వలపర్ల బల్లికుర మండలం, బాపట్ల జిల్లా,	16.3
4	120	దేవరంపాటి సురేంద్రబాబు తండ్రి సాంబయ్య	డోర్ నెంబర్ 2-159 ఏ, కె.సిరోడ్డు,చింతగుంపల్లేపోస్టు గోనసపూడి, ప్రకాశం జిల్లా,	41.370
5	121	గోన దేవ ప్రకాష్‌రాజు తండ్రి పెద్ద మోజేష్,	డోర్ నెం1- 1-47 మామిడిపాలెం, ఒంగోలు,	24.324
6	122	దేవరంపాటి సురేంద్రబాబు తండ్రి సాంబయ్య,	డోర్ నెంబర్ 2-159 ఏ, కె.సిరోడ్డు,చింతగుంపల్లేపోస్టు గోనసపూడి, ప్రకాశం జిల్లా,	210.290
7	124	దేవరంపాటి సురేంద్రబాబు తండ్రి సాంబయ్య,	డోర్ నెంబర్ 2-159 ఏ, కె.సిరోడ్డు,చింతగుంపల్లేపోస్టు గోనసపూడి, ప్రకాశం జిల్లా,	194.430
8	127	దేవరంపాటి సురేంద్రబాబు తండ్రి సాంబయ్య,	డోర్ నెంబర్ 2-159 ఏ, కె.సిరోడ్డు,చింతగుంపల్లేపోస్టు గోనసపూడి, ప్రకాశం జిల్లా,	54.530
9	128	దేవరంపాటి సురేంద్రబాబు తండ్రి సాంబయ్య,	డోర్ నెంబర్ 2-159 ఏ, కె.సిరోడ్డు,చింతగుంపల్లేపోస్టు గోనసపూడి, ప్రకాశం జిల్లా,	61.300
10	129	దేవరంపాటి సురేంద్రబాబు తండ్రి సాంబయ్య,	డోర్ నెంబర్ 2-159 ఏ, కె.సిరోడ్డు,చింతగుంపల్లేపోస్టు గోనసపూడి, ప్రకాశం జిల్లా,	80.000
11	160	కోక్కిలిగడ్డ రాము తండ్రి వీరరాఘవులు	డోర్ నెంబర్ 28-178, NTRవీధి,పల్లేపాలెం,దక్షిణం కొత్తపట్నం,ప్రకాశం జిల్లా	24.800
12	25	శ్రీమతి పోకురి స్వాతి భర్త రఘు ప్రసాద్‌చౌదరి	విష్ణలయం,పురం సెంటర్ టంగుటూరు, ప్రకాశంజిల్లా,	250.40
13	41	తీగల సావిత్రి భర్త ప్రతాప్	రామాలయంవీధి,జక్కరయ్య హాస్పిటల్ దగ్గర, ఒంగోలు	40.370

షరతులు : 1. వేలంలో పాల్గొనదలచినవారు రూ.10,000/- (అక్షరముల పది వేల రూపాయిలు మాత్రమే) ధరావత్తు మధ్యాహ్నం 1-00 గంటలోపు చెల్లించవలెయును. 2.వేలంలో ఆభరణములు పొందిన వారు ధరావత్తు సొమ్ము మినహా మిగిలిన సొమ్మును వెంటనే చెల్లించి ఆభరణములను పొందవలెయును. వేలంలో ఆభరణములను పొందనివారికి ధరావత్తు సొమ్ము వేలం అనంతరం తిరిగి ఇవ్వబడును. 3. ఏ స్థితి లోనైనా వేలం నిలుపుదల చేయుటకు గాని నియమ నిబంధనలు మార్చుకొనుటకు గాని సంస్థ వారికి పూర్తి అధికారము కలదు. 4. వేలములో పాడిన సొమ్మును అంగీకరించుటకు లేక తిరస్కరించుటకు గాని సంస్థ వారికి పూర్తి అధికారము కలదు. 5. వేలంలో పాల్గొనువారు ఆధారు మరియు పాన్ కార్డు కాఫీలను సమకూర్చవలెయును.

ఒంగోలు **సం/- అధీకృత అధికారి**

తేది : 12-05-2023 **టి.రమణయ్య**

కార్పొరేటర్ల కొంగొత్త 'ఆశ'

(మొదటిపేజీ తరువాయి)

రాబట్టాలో అర్థం కాక జుట్టు పీక్కుంటున్నారు. కాంట్రాక్టర్‌కు ముందస్తుగా డబ్బులు ఎలా చెల్లించారని అధికారులను ప్రశ్నించగా టెండర్ నిబంధల మేరకే చెల్లించామని చెబుతున్నారు.

ఎలాగైనా వెళ్లాలనే తలంపుతో...

గతంలో టూర్ పేరిట వివిధ ప్రాంతాలను చుట్టి రావాలన్న కార్పొరేటర్ల కల కాంట్రాక్టర్ మరణంతో నెరవేలేదు. దీంతో ఈసారి ఎలాగైనా టూర్‌కు వెళ్లాలని అధికార పార్టీ కార్పొరేటర్లు ఉవ్విళ్లూరుతున్నారు. కొంగొత్త ఆశలను తెర మీదకు తెచ్చారు. గతంలో అనుకున్న టూర్ ప్రోగ్రాంకు చిన్నచిన్న మార్పులు చేసి ఈసారి దేశంలోని ప్రముఖ ప్రాంతాలను చుట్టివచ్చేందుకు రెడీ అవుతున్నారు. అనుకున్నదే తడవుగా తాజాగా కార్పొరేటర్ల టూర్‌కు మున్సిపల్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదం తెలిపింది. ఇందుకోసం సుమారు రూ.39లక్షల మేర ఖర్చు చేసేందుకు ఆమోదం తెలిపారు. గురువారం రాత్రి ఇన్‌ఛార్జి మేయర్ వేమూరి బుజ్జి అధ్యక్షతన నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదం తీసుకున్నారు. రూ.40 లక్షల లోపు ఖర్చుకు, అభివృద్ధి కార్యక్రమాలకు స్టాండింగ్ కమిటీకి ఆమోదం తెలిపే హక్కు ఉంది. సాధారణ సమావేశంలో ఈ విషయం పెడితే అభ్యంతరాలు వ్యక్తమవుతాయనే తలంపుతో స్టాండింగ్ కమిటీ సమవేశంలో ఆమోదం తెలిపారు. త్వరలోనే కౌన్సిల్‌లో కూడా పెట్టి టూర్ వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మొదట యాత్ర ఫెయిల్ కావడంతో రెండో దఫా యాత్ర విజయంతం చేసుకునేందుకు పాలకవర్గ పెద్దలు కూడా ఉవ్విళ్లూరుతున్నారు. ఇందుకు అధికారులు కూడా సై అంటున్నారు. నగరంలో ప్రజా సమస్యలు అనేకం ఉన్నాయి. ఇటీవల రెండు రోజులపాటు రెండు అర్ధగంటలు నగరంలో జోరు వాన కురిస్తే నగరంలో ప్రధాన ప్రాంతాలు జలమయమయ్యాయి. నగరంలోని డ్రెయినేజీ డొల్లతనాన్ని ఈ వర్షాలు మరోసారి గుర్తు చేశాయి. ఇంతకీ విజ్ఞాన యాత్రల పేరుతో కార్పొరేటర్లు సాధించేదేంటి..? దాని వల్ల నగర ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఏంటి...? అనే ప్రశ్నలకు మాత్రం సమాధానాలు కానరావడం లేదు. ఎవరేమనుకున్న మాదారి మాదే అన్నట్లు అధికార వైసిపి కార్పొరేటర్ల తీరు కనిపిస్తుండటం విశేషం.

ఆ డబ్బులు రికవరీ చేస్తాం

వేమూరి సూర్యనారాయణ, ఇన్‌ఛార్జి మేయర్

గతంలో కార్పొరేటర్లు టూర్‌కు వెళ్లేందుకు ఒక టూర్ ఏజన్సీకి డబ్బులు ఇచ్చాం. టెండర్ నిబంధనల ప్రకారమే చెల్లింపులు జరిగాయి. అయితే కాంట్రాక్టర్ ఆకస్మికంగా మరణించారు. నగరపాలక సంస్థ చెల్లించిన డబ్బులు వారి కుటుంబ సభ్యుల ద్వారా రికవరీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఇందుకు లీగల్‌గా తీసుకోవాల్సిన చర్యలపై మున్సిపల్ స్టాండింగ్ కమిటీ లాయర్‌లతో చర్చిస్తున్నాం. కార్పొరేటర్ల మొదటి దఫా అధ్యయన యాత్ర ఆగిపోవడంతో, ఈ దఫా తీసుకువెళ్లాలని నిర్ణయించాం. ఇందుకు స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు ఆమోదం తెలిపారు.

IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM

O.S.1425/2021

Between:
M/s. Sai Srinivasa Enterprises,
Rep. by its Proprietor:
Sri Atluri Suresh Kumar,
S/o. Sri Rama Krishna ... Plaintiff
And:
M/s. Ceasan Glass Pvt., Limited,
Rep. by its Managing Director:
Sri Chaluvadi Venkata Raghu
Rama Gupta ...Defendant

SUMMONS

To,
The Defendant :
M/s. Ceasan Glass Pvt., Limited,
Rep. by its **Managing Director:**
Sri Chaluvadi Venkata Raghu Rama Gupta,
S/o.Chaluvadi Lakshmi Narayana,
D.No.8-434, Beside Nirmla Nagar,
Ongole-523 001.

Take notice that, the above name plaintiff has instituted the above O.S.against you for recovery of **Rs.19,47,159/-** (Rupees: Nineteen lakhs forty seven thousand one hundred and fifty nine only) with subsequent interest thereon @ 12% p.a from the date of filing of the suit till the date of realization. You are hereby summoned to appear in the above Court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the above suit on **26-07-2023** at **10:30 A.M.** In default of your appearance on that day the suit will be heard and determined in your absence basing on the material available in the Court.

U.S.V. PRASAD,
P. SUKUMAR RAO
Advocates
Visakhapatnam, **Cell: 9866022537.**

ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగం గెలిపించింది

జీవో 1 రద్దుపై హైకోర్టు తీర్పు శుభపరిణామం • టీడీపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

వైసిపి ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను హరించేలా తీసుకువచ్చిన జీవో నెంబర్ ఒకటిని రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు ఇవ్వడం ప్రభుత్వానికి చెంప పెట్టు అని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శుక్రవారం జీవో నెంబర్ 1ని రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రాథమిక హక్కులను కాలరాస్తూ పాదయాత్ర, ర్యాలీ, సభలకు ఆటంకం కలిగించడం కోసం, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు, ప్రతిపక్షాలపై ఉక్కు పాదం మోపాలని ప్రభుత్వం చీకటి జీవోను తీసుకొచ్చిందన్నారు. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ప్రజాస్వామ్యాన్ని కాపాడిందన్నారు. ప్రభుత్వం, పోలీసులు ఇప్పటికైనా కళ్లు తెరవాలన్నారు. ప్రశాంతంగా నిరసన తెలిపే హక్కు ప్రజలకు, ప్రతిపక్షాలకు ఉందని, చిన్న ఉద్యమం చేసినా ఈ ప్రభుత్వం సహించడం లేదన్నారు. జగన్‌రెడ్డి దోపిడీలు, నవమోసాలు, నేరాల్ని కప్పిపుచ్చుకునేందుకు చీకటి జీవోను తీసుకొచ్చారన్నారు. రోడ్డుషోలు, సభల ద్వారా పెంచిన పన్నులు, చార్జీలు, దోపిడీలు, నవమోసాలు బయటపడతాయనే భయంతో జిఓ 1ని జగన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలపై రుద్దిందన్నారు. వైసిపి పాలనలో ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. లాండ్, శ్యాండ్, వైన్, మైన్, డ్రగ్స్, రెడ్ శాండల్‌లో లక్షల కోట్లు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. నిరంకుశ జగన్‌రెడ్డి బలవంతపు సభలు జనం లేక వెలవెలబోతున్నాయన్నారు.

చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ రోడ్‌షోలకు బందోబస్తు కల్పించాల్సిన బాధ్యత చట్టప్రకారం జగన్‌రెడ్డి ప్రభుత్వంపై ఉందన్నారు. జగన్‌రెడ్డి, వారి తల్లి, చెల్లి, తండ్రి పాదయాత్రలకు చంద్రబాబు ప్రభుత్వం భద్రత కల్పించిందని గుర్తు చేశారు. జగన్‌రెడ్డి పాదయాత్రల్లో 8మంది చనిపోయినా పాదయాత్రలను చంద్రబాబు ప్రభుత్వం నిలుపుదల చేయలేదని, అక్రమ జిఓలు జారీ చేయలేదని గుర్తు చేశారు. జి.ఓ నెం.1 జారీ చేశారంటే జగన్‌రెడ్డికి ప్రజాస్వామ్యంపైన, ప్రజలపైన నమ్మకం లేదని రుజువైందన్నారు. స్టేట్ టెర్రరిజం అమలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి సంవత్సరమే పత్రికలు, ఛానళ్లు, సోషల్ మీడియాపై విషం చిమ్ముతూ జి.ఓ. 2430ను తెచ్చి, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వద్ద మొట్టికాయలు తిన్నారన్నారు. నిన్న విజయనగరంలో వైసిపి నేతలు పెద్ద ప్రదర్శనలు చేశారని. ప్రభుత్వానికి ఒకవిధంగా, ప్రతిపక్షాలకు ఒకవిధంగా వ్యవహరించడం వివక్ష కాదా? హిట్లర్, ముస్సోలినీ, బ్రిటీష్ వారి నిరంకుశత్వ పాలనను మరిపించేలా జగన్ పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. కోర్టు తీర్పుతోనైనా ప్రభుత్వం కళ్లు తెరిచి బాధ్యతగా మెలగాలని ఏలూరి హితవు పలికారు.

రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-వేటపాలెం

ఈ నెల 18వ తేదీన జరగనున్న రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని పలువురు చేనేత సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం వేటపాలెంలో చేనేత సమస్యల పరిష్కారానికి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి చేనేత కార్మిక సంఘం నాయకులు పి కొండయ్య, మేడా వెంకటరావు, శీలం వెంకటేశ్వర్లు, పింజల భూషణంబాబు, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

16న సిఎం సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-చెరుకుపల్లి

ఈ నెల 16వ తేదీ మంగళవారం నిజాంపట్నంలో నిర్వహించే మత్స్యకార భరోసా కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రానున్న నేపథ్యంలో కార్యక్రమానికి మండల పరిధిలోని ప్రజా ప్రతినిధులు పార్టీ కార్యకర్తలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని వైసిపి మండల కన్వీనర్ పయనం ఏడుకొండలరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిషత్ అధ్యక్షులు మత్తి దివాకర రత్న ప్రసాద్ అధ్యక్షతన పార్టీ కార్యకర్తలు ప్రజా ప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పొన్నపల్లిలో నిర్వహించిన ఈ సమావేశంలో పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు పలువురు పాల్గొని సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మాజీ కన్వీనర్ దొంతిబోయిన వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు బండారు రామారావు, రావూరి శివ నాగేశ్వరరావు, ఎల్లెల రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సముద్రంలో దూకబోయిన వృద్ధురాలు

కాపాడిన మెరైన్ పోలీసులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

కన్న కొడుకులే తల్లిని పట్టించుకోకపోవడంతో ఆ వృద్ధురాలి తీవ్ర మనస్తాపం చెందింది. తాను ఎవరికీ భారం కాకూడదన్న ఉద్దేశంతో చరిపోవడానికి సిద్ధపడింది. శింగరాయకొండ మండలం పాకల పల్లెపాలెం వద్దకు వచ్చి సముద్రంలో దూకేందుకు ప్రయత్నం చేస్తుండగా మెరైన్ పోలీసులు కాపాడారు. నెల్లూరు జిల్లా కందుకూరు మండలం పందలపాడు గ్రామానికి చెందిన కూనం వెంకట రమణమ్మ అనే 70 సంవత్సరాల వృద్ధురాలికి ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. అందరూ ఉన్నత స్థితిలో ఉన్నారు. అయితే వృద్ధాప్యంలో ఉన్న తనను ఎవరూ పట్టించుకోవటం లేదని మనస్తాపం చెంది చనిపోవాలని నిర్ణయించుకుంది. ఇటీవలే వచ్చిన వృద్ధాప్య పెన్షన్ చేతిలో పట్టుకొని పందలపాడు నుంచి కందుకూరు, కందుకూరు నుంచి సింగరాయకొండకు వచ్చి సింగరాయకొండ నుంచి ఆటోలో పాకల సముద్రం వరకు వెళ్లింది. ఎలాగూ చనిపోతున్నానని, ఆటో డ్రైవర్‌కు 1000 రూపాయల వరకు ఇచ్చి ఉంచుకోమని చెప్పింది. ఆ తర్వాత అక్కడ కాసేపు అలా ఉండి సముద్రంలో స్నానం చేస్తున్నట్లు అలా లోపలికి వెళ్లింది అక్కడ ఉన్న మెరైన్ పోలీసులు అనుమానం వచ్చి ఒక కన్ను ఆమెపై ఉంచారు. ఆ కన్నే ఆమెను కాపాడింది. వెంకట రమణమ్మ చనిపోవాలన్న ఉద్దేశంతో సముద్రంలో ముందుకు వెళ్లేందుకు ప్రయత్నం చేస్తుండగా అనుమానంలో ఉన్న మెరైన్ పోలీసులు వెంటనే ఆమెను ఆపారు. ఒడ్డుకు తీసుకొచ్చి అనుమానాలను నివృత్తి చేసుకునే ప్రయత్నం మొదలుపెట్టడంతో వీళ్ల అనుకున్నదంతా నిజమైంది. మెరైన్ సీఐ ఆర్ఎస్ కిషోర్ కుమార్ రంగంలోకి దిగి ఆమెను కాపాడిన మెరైన్ పోలీసులను అభినందించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కందుకూరు మండలం పందలపాడులో ఉన్న కుమారులతో ఫోన్లో మాట్లాడి వారిని పిలిపించారు. జరిగిన విషయాలను అడిగి తెలుసుకుని తల్లి ఆలనపాలన చూడాల్సిన బాధ్యత కుమారులపైన ఉందని వివరించారు. కందుకూరు పోలీసులకు కూడా సమాచారం అందించి మరోసారి కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. మహిళను కాపాడిన మెరైన్ పోలీసులను మత్స్యకారులు అభినందించారు.

చెరుకుపల్లిలో జాతీయ రహదారి నిర్మాణం

ప్రజాశక్తి-చెరుకుపల్లి

చెరుకుపల్లిలో రోడ్డు విస్తరణ పనులు నిర్వహిస్తున్న దృశ్యం

జాతీయ రహదారి విస్తరణ పనులు చెరుకుపల్లి పట్టణంలో శరవేగంగా జరుగుతున్నాయి. ప్రకాశం జిల్లా ఒంగోలు నుంచి పశ్చిమ గోదావరి జిల్లా దిగమర్రు వరకు నిర్వహిస్తున్న 216ఏ జాతీయ రహదారి విస్తరణ పనులు అన్ని ప్రాంతాలలో పూర్తవగా చెరుకుపల్లి పట్టణంలో మిగిలాయి. పట్టణంలో ప్రధానంగా ఆక్రమణల నేపథ్యంలో, సొంత భూమి సేకరించే కార్యక్రమంలో భాగంగా పనులు ప్రారంభించడం లేట్ అయింది. అదే విధంగా మురుగు నీటిపారుదల సమస్య కూడా ఉండడంతో రహదారి నిర్మాణ సంస్థ శరవేగంగా పనులు జరుపుతుంది. రహదారి విస్తరణ పూర్తయితే పట్టణ ప్రజలు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న డ్రైనేజీ సమస్య కూడా పరిష్కారం అవుతుందని ఆశిస్తున్నారు.

కీర్తివారిపాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-చీరాల

వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కారంచేడు ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో శుక్రవారం చీరాల మండలం కీర్తివారిపాలెంలో ఉచితంగా కంటి వైద్య శిబిరం జరిగింది. సుమారు 70 మందిని ఈ శిబిరంలో పరీక్షించారు. ఇరవై మందిని శస్త్ర చికిత్సల కోసం కారంచేడు కంటి ఆస్పత్రికి సిఫార్సు చేశారు. మిగిలిన వారికి వైద్య సలహాలు, మందులు ఇచ్చారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ గడ్డం శ్రీనివాసరావు సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో వై సుబ్బారావు, జి సుజాత, జి పృథ్వీరాజ్, ఐ వెంకట్, జి మణికంఠ, నాగరాజు, సాయికృష్ణ, ఉమాదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

కథల పుస్తకాలతో మేధస్సు

ప్రజాశక్తి-చీరాల

పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు

పుస్తక పఠనంతో విద్యార్థులకు మేధస్సు లభిస్తుందని, తద్వారా వారికి ప్రపంచంలో జరిగే అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉంటారు అని రిసోర్స్ పర్సన్ ఎం కృష్ణ మోహన్ అన్నారు. వేసవి శిక్షణా తగతులలో భాగంగా చీరాల శాఖా గ్రంథాలయంలో జనరల్ నాలెడ్జ్, పొడుపు కథలు రాసే విధానం, తెలుగు భాషపై పట్టు తదితర అంశాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం పిల్లలకు లోడో క్యారమ్స్ చెస్ కాంపిటీషన్ నిర్వహించి విజేతులైన విద్యార్థులకు ఆదివారం బహుమతులు ఇవ్వనున్నట్లు గ్రంథపాలకురాలు డి ధనమ్మ తెలిపారు.

కేరళ స్టోరీ చిత్రాన్ని ఏపీలో నిషేధించాలి

ప్రజాశక్తి-వేమూరు

ముస్లిముల మనోభావాలు దెబ్బతినే విధంగా ఉన్న ది కేరళ స్టోరీ చిత్రాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బ్యాన్ చేయాలని వేమూరు నియోజకవర్గ టిడిపి ముస్లిం మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ సిరాజుద్దీన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సమాజంపై తీవ్ర ప్రభావం చూపే విధంగా ది కేరళ స్టోరీ నిర్మితమయ్యిందని ఈ లాంటి చిత్రాల వల్ల మత సామరస్యం చిన్నాభిన్నం అవుతుందన్నారు. దీనిని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కూడా నిషేధించిందని అన్నారు. మైనారిటీల సంక్షేమమే ధ్యేయంగా చెప్పుకుంటున్న వైసిపి ప్రభుత్వం కూడా ఏపిలో బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు.

ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వేరుశనగ (ఫైల్)

అకాల వర్షాలకు దెబ్బతిన్న వేరుశనగ

ప్రజాశక్తి-చెరుకుపల్లి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వేరుశనగ రైతులు నష్టపోయారు. గతంలో 50 బస్తాల పైగా అయిన దిగుబడులు ప్రస్తుత అకాల వర్షాల కారణంగా 30, 20, 25 బస్తాలు మాత్రమే రావడంతో రైతులు దిగాలు పడిపోయారు. ఎకరాకు రూ.70,000 వరకు పెట్టుబడి పెట్టగా ఆమాత్రమయినా వస్తే చాలు అనుకుంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. 36 కేజీల కాయల బస్తా ధర రూ.2,600 వరకు ఉండగా, తగ్గిన దిగుబడుల నేపథ్యంలో రైతులకు నష్టాలు వస్తున్నాయి. నష్టపరిహారం పూర్తిగా పాడైన పంటకు మాత్రమే వచ్చే అవకాశం ఉండడంతో రైతులకు ఎటూ పాలుపోవడం లేదు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- చీమకుర్తి

చీమకుర్తి నార్త్ సబ్ స్టేషన్ పరిధిలోని ఆర్ఎల్ పురం, బుధవాడ ఇండస్ట్రియల్ ఏరియా ప్రాంతాలలో మరియు మరిచెట్లపాలెం, పులికొండ, చిన్నరావిపాడు, భూసురపల్లి గ్రామాల పరిధిలో విద్యుత్తు మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలోని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నర్సు పద్మావతిని సన్మానిస్తున్న డాక్టర్ బాబూరావు

వైద్యరంగంలో నర్సులు కీలకం

ప్రజాశక్తి-చీరాల

వైద్య రంగంలో నర్సులు ఎంతో కీలకమని, వారి సేవలు అభినందనీయమని రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఐ బాబూరావు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైకుంఠపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని నర్సులుగా విధులు నిర్వహిస్తున్న విజయ, ధన, సత్యవేదం, పద్మావతి, రమాదేవి నర్సులను ఘనంగా సత్కరించారు. అత్యవసర వైద్య సేవలను అందించడంలో నర్సుల సేవలు ప్రశంసనీయమని అన్నారు. మదర్ థెరిస్సా ఆదర్శ భావాలతో నర్సులందరూ ప్రజల ఆరోగ్యం పట్ల విధులు నిర్వహిస్తూ అందరి మన్ననలను పొందాలని కోరా రు. కార్యక్రమంలో డాక్టర్ శంకరరెడ్డి, డాక్టర్ జ్యోతిరావు, హాస్పిటల్ స్టాఫ్, అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ పోలుదాసు రామకృష్ణ, రోటరీ ప్రతినిధులు, నర్సులు పాల్గొన్నారు.

సౌజన్యకు 'యూట్యూబ్' అవార్డు

ప్రజాశక్తి-బాపట్ల

యూట్యూబ్ క్రియేటర్ సిల్వర్ బటన్ అవార్డును బాపట్ల మండలం ఆసోదివారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యాతం సౌజన్య శుక్రవారం అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత సౌజన్య మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల చిన్నారులకు ప్రాథమిక విద్యను సులభశైలిలో బోధించేందుకు తాను తయారు చేసిన దృశ్య మాధ్యమం విద్యార్థులకు విద్య పట్ల ఆసక్తి కలిగించే విధంగాఉందని అన్నారు. సులభతరంగా విద్యాబోధన చేస్తూ వారిలో ఆసక్తిని పెంపొందించి, సులువుగా విద్యను అందించాలనే లక్ష్యంతో తాను రూపొందించిన నూతన విద్యా విధానం టిఎల్ఎం యూట్యూబ్ ఛానల్ కు ఒక లక్షా నలభై వేల మంది సబ్ స్క్రైబర్స్ కు చేరువైందన్నారు. దీంతో యూట్యూబ్ ఛానల్ సంస్థ అవార్డు అందజేశారన్నారు. చిన్నారులు టెక్నికల్ పాయింట్స్, ఆటపాటలతో విద్యను నేర్చుకునే విధంగా వీడియోలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో కొత్త ఆలోచనలతో ఆన్‌లైన్ విద్యాబోధనలో నూతన విధానానికి తెరతీస్తానన్నారు. గోల్డెన్ బటన్ అవార్డును సాధించే దిశగా తాను మరిన్ని వీడియోలు వినూత్నంగా తయారు చేస్తానని తెలిపారు. అవార్డును అందచేసిన యూట్యూబ్ ఛానల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు సౌజన్యను అభినందించారు.

హజ్ యాత్రకు భారం తగదు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మైనారిటీ నాయకులు సిరాజుద్దీన్

హజ్ యాత్రకు ఏపి ప్రభుత్వం ముస్లిములపై అదనపు భారం మోపడం తగదని వేమూరు నియోజకవర్గ టిడిపి మైనారిటీ సెల్ అధ్యక్షులు సయ్యద్ సిరాజుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ హజ్ యాత్రకు ఈ ఏడాది 1982 మంది ఏపి నుంచి వెళ్లనున్నారని, దీనికి గాను హైదరాబాద్ నుంచి రూ.3.05 లక్షల ఖర్చు కాగా రూ.3.88 లక్షలు ఏపి వసూలు చేస్తోందని, తద్వారా ముస్లిములపై 88 వేల భారాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మోపారని ఆందోళన వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి మైనారిటీలకు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అణగదొక్కుతున్నదని ఆరోపించారు.

కమతం శృతికి డాక్టరేట్

ప్రజాశక్తి-రేపల్లె

బయోటెక్నాలజీ విభాగంలో రేపల్లె మండలం పిరాటలంక గ్రామానికి చెందిన కమతం శృతి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. ఆచార్య కె కస్తూరి పర్యవేక్షణలో మెరైన్ నోకార్డియోప్సిస్ డాసన్‌విల్లి -కెఎస్‌బి-5 నుంచి వేరుచేయబడిన బయోయాక్టివ్ సమ్మేళనాల యాంటీమైక్రోబయల్, యాంటీ ఆక్సిడెంట్ మరియు సైటోటాక్సిక్ కార్యకలాపాల అంశంపై శృతి పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఎస్‌కెడి యూనివర్సిటీకి చెందిన ఆచార్య డి సురేష్‌కుమార్.. శృతి పరిశోధన ఫలితాలపై సంతృప్తి చెంది డాక్టరేట్ పట్టాను అందజేశారు. ఈ కార్యక్రమంలో బయోటెక్నాలజీ విభాగాధిపతి కృష్ణసత్య, సైన్స్ జీన్ అండ్ బివిఎస్ చైర్‌పర్సన్ సింహాచలం శ్రీనివాస్, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

తడిసిన జొన్న, మొక్కజొన్న వివరాలు ఇవ్వండి

ప్రజాశక్తి-వేమూరు

అకాల వర్షాల వల్ల వేమూరు మండలంలో తడిచిన మొక్కజొన్న, జొన్న పంట వివరాలు తమ గ్రామాల్లోని విఆర్ఓ, విఎఎ టీమ్‌కు ఇవ్వాలని వేమూరు మండల వ్యవసాయధికారి సిహెచ్ సునీత శుక్రవారం కోరారు. గ్రామ స్థాయి టీమ్ నష్ట పరిహారం అంచనాలు తయారు చేయడానికి ఈ నెల 15వ తేదీ ఆఖరి రోజు. కాబట్టి రైతులు అందరూ తమ పొలాల్లోని బూజు పట్టిన, మొలకలు వచ్చిన మొక్కజొన్న, జొన్న పంటల వివరాలు తమ తమ గ్రామ విఆర్ఒకు, విఎఎలకు ఇవ్వాలని రైతులను కోరుతున్నట్లు ఏవో సునీత ఆ ప్రకటనలో తెలిపారు.

రాయితీలకు మంగళం!

- దిక్కుతోచని స్థితిలో నేతన్నలు
- సంక్షేమ పథకాలు అమలు చేయాలని వినతి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

చేనేత రంగాన్ని, నేతన్నలను ఆదుకునేందుకు గతంలో ప్రభుత్వాలు ఇస్తూ వచ్చిన రాయితీలన్నీ మూడేళ్లుగా నిలిచిపోయాయి. ముడి నూలు, అద్దకానికి వినియోగించే రంగులు, రసాయనాల ధరలు పెరిగిపోయాయి. సహకార చేనేత రంగం నిర్వీర్యం అయిపోయింది. కరోనా కాలం నుంచి చేనేత అమ్మకాలు మందగించి మాస్టర్ వీవర్లు చేనేత వస్త్రోత్పత్తిని తగ్గించుకుంటూ వస్తున్నారు. ఈ కారణంగా నేతన్నలకు మగ్గంపై పని తగ్గిపోయింది. గతంలో పోల్చిచూస్తే మగ్గానికి దాని అనుబంధ వృత్తుల్లో ఉన్న వారి పనుల్లో సగానికి సగం కోత పడింది. సక్రమంగా చేనేత వృత్తి సాగక రోజు వారీ జీవనం కష్టమై నేతన్నలు అప్పులు చేస్తూ వాటిని తీర్చే దారి లేక సతమతమవుతున్నారు. చేనేతలు అత్యధికంగా ఉన్న బాపట్ల, ప్రకాశం జిల్లాలోని చేనేతల పరిస్థితి దయనీయంగానే ఉంది. రెండు జిల్లాల్లోను లక్షా 50 వేల మంది వరకు చేనేత, దాని అనుబంధ రంగ కుటుంబాలకు చెందిన వారు ఉన్నారు. సుమారుగా 15 వేల నేత కుటుంబాలు, ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఉన్న చేనేత సహకార సంఘాలేవి నేతన్నలకు అండగా ఉండే పరిస్థితి లేకపోయింది.

కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్టీ కార్మికుల పాలిట శాపంగా మారింది. నూలు రేట్లు, పట్టు రేట్లు విపరీతంగా పెరగడం వల్ల తయారైన చేనేత వస్త్రాలు అమ్ముడుపోవడం మాస్టర్ వీవర్స్‌కు సవాలుగా మారింది. దీంతో ఉపాధి అవకాశాలు కుంటుపడి చేనేత వ్యవస్థ దయనీయంగా మారింది. దీనికి తోడు పవర్లూమ్ ఉత్పత్తులు మార్కెట్లో చేనేత ఉత్పత్తులుగా అమ్ముడవుతున్నాయి. దీంతో చేనేతల ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుంది. రాష్ట ప్రభుత్వం చేనేతలకు ఎలాంటి సబ్సిడీలను ఇవ్వడం లేదు. చేనేత వస్త్ర ఉత్పత్తులను కొనేందుకు తగు చర్యలు తీసుకోనందువల్ల చేనేత వ్యవస్థ రాను రాను దీనావస్థలోకి వెళుతోంది.

కరోనా కల్లోల కాలం నుంచి దేశంలో అతి పెద్ద ఉపాధి రంగం అయిన చేనేత పరిశ్రమ దారుణంగా దెబ్బతింది. కోవిడ్ అనంతర కాలం నుంచి నేత పనులు లేక ఈరంగం కొంత మేర స్తంభించిపోయింది. చేనేత వస్త్రాలకు ఆదరణ తగ్గి ఎగుమతులు లేక, కొనేవారు రాక చేనేత ఉత్తత్పులు మందగించాయి. ఈ నేపథ్యంలో మాస్టర్ వీవర్లు కూడా నేతన్నలను ఆదుకునే పరిస్థితి లేకపోయింది. మరమగ్గాలపై ఎక్కువ మంది ఆధారపడుతున్నారు. దీంతో నేత వస్త్రాల ఉత్పత్తి తగ్గిపోయింది. ఇబ్బడిముబ్బడిగా పెరిగిన నూలు, పట్టు ధరలు చేనేత రంగాన్ని మరింత కునారిల్లజేశాయి. అద్దకానికి వినియోగించే రంగులు, రసాయనాల ధరలు బాగా పెరిగిపోయాయి. చిలపనూలుపై కేంద్రం విధించిన జిఎస్టీతో ఈ రంగం దిక్కుతోచని స్థితిలో ఉంది.

మగ్గంపై నేతన్న

ఆసు కడుతున్న చేనేతలు

చేనేత రంగంలో ఉపాధి హామీ పథకం అమలు చేయాలి

ఇలా ధరల పెరుగుదలతో పాటు చేనేత రంగానికి ఎలాంటి రాయితీలు లేకుండా పోయాయి. రాష్ట్ర ప్రభుత్వం నేతన్న నేస్తం పేరుతో మగ్గం ఉన్న చేనేత కార్మిక కుటుంబానికి ఏడాదికి రూ.24 వేలు ఇచ్చి చేతులు దులిపేసుకుంది. గతంలో ఇచ్చినట్లుగా సహకార సంఘాల ద్వారా ఎలాంటి రాయితీలు లేకుండా పోయాయి. గతంలో ప్రభుత్వం మిల్లుల వద్ద నూలు కొనుగోలు చేసి సహకార సంఘాలకు 10 శాతం రాయితీపై ఇచ్చేవారు.ఇది నిలచిపోయింది. దీంతో పాటు చేనేత రంగాన్ని ఆదుకునేందుకు పావలా వడ్డీ పథకం, త్రిఫ్ట్ ఫండ్, వస్త్ర రాయితీ లాంటి పథకాలు ఉండేవి. ప్రస్తుతం ఇవేవీ లేకపోవడంతో సహకార సంఘాలు నిర్వీర్యం అయ్యాయి. చేనేత రంగం కోసం నెలకొల్పబడిన ఆప్కో ఊసే లేదు. గతంలో ఆప్కో ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై చేనేత బట్ట కొనుగోళ్లు జరిపేది. కాని అలాంటి కొనుగోళ్లు కాని, రాయితీలు కాని లేకుండా పోయాయి. మగ్గాన్నే నమ్ముకుని ఉన్న నేతన్నలను పట్టించుకునే నాథుడు లేకపోయారు. ఈ నేపథ్యంలో చేనేత కార్మికులను ఆదుకునేందుకు ప్రత్యేక ఆర్థిక చేయూత అవసరం ఉంది. చేనేతలు, దాని అనుబంధ వృత్తుల్లో ఉన్న వారిని ఆదుకునేందుకు రాష్టప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలి. చేనేత వస్త్ర ఉత్పత్తులపై విధిస్తున్న జిఎస్టీ తొలగించాలి. చేనేత రంగాన్ని ఉపాధి కల్పనా రంగంగా ప్రభుత్వం గుర్తించి ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేసి జీవనభద్రత కల్పించాలి. యారన్‌పై రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం,కేంద్రప్రభుత్వం 20 శాతం సబ్సిడీ ఇవ్వాలని చేనేతలు కోరుతున్నారు.

ప్రత్యేక చేనేత బ్యాంకు ఏర్పాటు అవసరం

చేనేతలు సొంతంగా తమ వృత్తిని కొనసాగించేందుకు సంక్షేమ పథకాల అమలు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన నిధులు మంజూరు చేయాలని నేతన్నలు కోరుతున్నారు. బ్యాంకు యాజమాన్యాలు ష్యూరిటీలు లేకుండా చేనేతలకు రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపని కారణంగా కనీసం రూ.1500 కోట్లతో కేంద్రం ప్రత్యేకంగా చేనేత బ్యాంకును ఏర్పాటు చేయాలనేది నేతన్నల దీర్ఘకాలిక కోరిక. సబ్సిడీపై ముడి సరుకును అందించాలని, చేనేతల ఆర్థిక చేయూత కోసం సంక్షేమ పథకాలు అమలు చేయాలని నేతన్నలు కోరుతున్నారు.

కామన్ ఫెసిలిటీ సెంటర్లను అందుబాటులోకి తేవాలి

బాపట్ల, ప్రకాశం జిల్లాలో చేనేత వృత్తిపై జీవిస్తున్న వారి కోసం కామన్ ఫెసిలిటీ సెంటర్ల నిర్మాణాలు జరిగాయి. ఒక్కొక్క సెంటర్‌ను రూ.35 లక్షల అంచనాలతో నిర్మించారు.

జిల్లాలో 500 నుంచి 700 మంది వరకు చేనేతలు ఉన్న ప్రాంతాన్ని క్లస్టర్‌గా చేశారు. ఇక్కడ మగ్గాలు ఏర్పాటు చేసి సులువుగా పని చేసుకునేందుకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచి వారికి వృత్తి నైపుణ్యాన్ని అందజేసేందుకు వీటిని నిర్మించారు. నిర్మాణాలు పూర్తయినప్పటికీ ఇవేవీ నేటికీ చేనేతలకు అంటుబాటులోకి రాలేదు. ఇవి అందుబాటులోకి వస్తే చేనేత యువత తమ నైపుణ్యాన్ని పెంచుకునే వీలుంది. ఈ కేంద్రాలకు అనుబంధంగా చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసే చర్యలు చేపట్టాలి. జిల్లాలోని నేతన్నల కుటుంబాలు రోజు వారీ జీవనం కోసం ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది. నేత కార్మికుల బతుకులను మెరుగుపరచేందుకు వారి స్థితిగతులు, జీవన ప్రమాణాలను పెంపొందించడమే లక్ష్యంగా రాష్ట ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేయాల్సి ఉంది.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజన నాయకులు

వైసిపి పాలనలో గిరిజన విద్యకు గ్రహణం

ప్రజాశక్తి-బాపట్ల

వైసిపి పాలనలో గిరిజనుల విద్యకు గ్రహణం పట్టిందని బాపట్ల పార్లమెంటు గిరిజన విభాగం అధ్యక్షులు తిరుమలశెట్టి శ్రీను అన్నారు. శుక్రవారం బాపట్ల అంబేద్కర్ సర్కిల్ వద్ద బాపట్ల పార్లమెంటు ఎస్టి సెల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో గిరిజన గురుకులాల విద్యావ్యవస్థ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై ఫలితాల్లో పూర్తిస్థాయిలో వెనుకబడి ఉందన్నారు. గిరిజన గురుకులాల్లో పదో తరగతి ఫలితాలలో ఉత్తీర్ణత శాతం దారుణంగా పడిపోయిందన్నారు. రాష్ట్రంలో 128 గిరిజన గురుకుల పాఠశాలల్లో సుమారు 40 పాఠశాలల్లో ఉత్తీర్ణత 40 శాతానికి పడిపోయిందన్నారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్ల జగన్ పాలనలో గిరిజన గురుకులాల్లో సరైన మౌలిక సదుపాయాలు లేవు.సబ్జెక్ట్ టీచర్స్ లేరు. ఇంతవరకు డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా టీచర్స్ భర్తీ చేయకపోవటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా నిలిచిందన్నారు. రానున్న విద్యా సంవత్సరాల నుంచి అయినా గిరిజన గురుకులల్లో సరైన మౌలిక సదుపాయాలు కల్పించి సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చుక్కా పాలారాజ్, బాలిగ శ్రీనివాసరావు, ఇండ్ల శ్రీనివాసరావు, నంబూరి ఏడుకొండలు, మహిమరాజు, పొన్నరుసు వెంకటేశ్వర్లు, పోలయ్య, అంకమ్మరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నల్లూరి నర్సింగ్ హెూమ్ సిఇఒ సాతులూరి నరసింహమూర్తి

'నల్లూరి'లో ఎమర్జెన్సీ, క్రిటికల్ కేర్ పటిష్టం

ప్రజాశక్తి-ఒంగోలు

ఒంగోలులోని నల్లూరి నర్సింగ్ హెూమ్‌లో ఎమర్జెన్సీ, క్రిటికల్ కేర్ విభాగాన్ని మరింత పటిష్టం చేస్తున్నామని నల్లూరి నర్సింగ్ హెూమ్ సిఇఒ సాతులూరి నరసింహమూర్తి తెలిపారు. ఎమర్జెన్సీ మరియు క్రిటికల్ కేర్ విభాగంలో విశేష అనుభవం కలిగిన డాక్టర్ శ్రీచరణ్, డాక్టర్ మదుల, డాక్టర్ మధు వైద్య బృందం ఈ విభాగంలో తమ పూర్తి కాలం వైద్య సేవలు అందజేస్తారని తెలిపారు. ఎమర్జెన్సీ సేవలైన పాము కాటు, తేలు కాటు, పురుగు మందులు తాగిన వారికి, అవయవాల పనితీరు సరిగా లేనివారికి, ఆస్తమా, సిఓపిడి, కిడ్నీ ఫెయిల్యూర్, శ్వాసకోశ వ్యాధులు, ఇన్ఫెక్షన్ మరియు ఐసీయూ ట్రీట్మెంట్ అవసరమైన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తామని నల్లూరి నర్సింగ్ హెూమ్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ జనరల్ అండ్ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నల్లూరి నితిన్ తెలియజేశారు. ఎమర్జెన్సీ అండ్ క్రిటికల్ కేర్ విభాగాధిపతి డాక్టర్ శ్రీచరణ్ మాట్లాడుతూ యశోద హాస్పిటల్స్ మరియు రమేష్ హాస్పిటల్స్‌లో ఇంతకు ముందు వైద్యసేవలు అందించి, ఇప్పుడు నల్లూరి నర్సింగ్ హెూమ్‌లో తన వైద్య సేవలు అందించడం చాలా సంతోషకరంగా ఉందని తెలియజేశారు. ఎటువంటి ఎమర్జెన్సీ అండ్ క్రిటికల్ కేసునైనా నల్లూరి నర్సింగ్ హెూమ్‌లో ట్రీట్ చేస్తామని అన్నారు. ప్రకాశం జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య రక్షణ కోసం నల్లూరి నర్సింగ్ హెూమ్ వారు హెల్త్ ప్రివిలైజ్డ్ కార్డ్‌ను మీడియా మిత్రులకు అందజేశారు. ఈ కార్డుతో వైద్య సేవల్లో రాయితీ పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ బేరి ఆంజనేయులురెడ్డి, డాక్టర్ మృదుల, డాక్టర్ మధు, నల్లూరి నర్సింగ్ హెూమ్ సిఈఓ నల్లూరి నీరజ్, మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసిం సైదా, సీనియర్ మేనేజర్ శ్రీనివాస్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ నాయక్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు 200 పనిదినాలు కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-టంగుటూరు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పని దినాలను 200కు పెంచి కూలీలకు చెల్లించే రోజువారీ వేతనం రూ.600 చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మర్లపాడు గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ వ్యవసాయంలో ప్రస్తుతం వస్తున్న పలు మార్పులతో పని దినాలు కుదించబడుతున్నట్లు తెలిపారు. 2,3 నెలలు మాత్రమే పనులు ఉండగా తరువాత గ్రామాల్లో తీవ్ర కరువు నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి కరువు

కూలీలతో మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

కాలంలో కరువు పని దినాలను పెంచడంతోపాటు దినసరి కూలి రూ.600 ఇచ్చి గ్రామీణ కూలీలను ఆదుకోవాలని కోరారు. వలసల నివారణ, పేదరిక నిర్మూలన తదితర లక్ష్యాలతో ఉపాధి హామీ చట్టం ఏర్పడిందన్నారు. ఒక్కో జాబ్ కార్డుకు100 రోజుల పనిదినాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అయితే కుటుంబంలో నలుగురు కూలీలు ఉంటే వారికి కేవలం 25 రోజులు మాత్రమే పని దొరుకుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత 16ఏళ్లుగా జరిగిన అనేక ఉద్యమాల ఫలితంగా కూలీల కనీస వేతనం రూ.100 నుంచి రూ. 272 కు పెరిగిందన్నారు. అదేవిధంగా ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో టెంట్లు, మెడికల్ కిట్లు, మంచినీటి సౌకర్యంతో పాటు రోజురోజుకు పెరుగుతున్న ఎండలకు కూలీలు వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం టంగుటూరు మండల కన్వీనర్ వేసుపోగు మోజెస్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

రూ.10 వేల ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-దర్శి

దర్శిలోని క్రిష్టియన్ పాలెంకు చెందిన ఇత్తడి బ్రహ్మయ్య (45) అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను మాజీ ఎంపిపి ఇత్తడి దేవదానం చేతుల మీదుగా దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి రూ. 10 వేల ఆర్థిక శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ డిఎస్‌పిని కలిసిన దేవస్థాన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్థానిక కేశవ స్వామి పేటలోని శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థాన కమిటీ సభ్యులు ఒంగోలు ట్రాఫిక్ డిఎస్‌పి విక్రమ్ శ్రీనివాసరావును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డిఎస్‌పి కార్యాలయంలో ఆయన్ని కలసి ఘనంగా సత్కరించారు. ఈనెల 14న శ్రీ గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో జీవ ధ్వజ స్తంభ పున్నప్రతిష్ట, మహా కుంభాభిషేకం, భారీ అన్నసంతర్పణ కార్యక్రమాల సందర్భంగా దేవాలయానికి సుమారు 10 వేల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అందులో భాగంగా ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లపై వారు డిఎస్‌పితో చర్చించారు. సానుకూలంగా స్పందించిన డిఎస్‌పి కార్యక్రమాల నిర్వహణకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. డిఎస్‌పిని కలిసిన వారిలో దేవస్థాన ధర్మకర్తల మండలి ఛైర్మన్ ఈదుపల్లి గురునాధరావు, సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, కరేటి కిరణ్ బాబు పాల్గొన్నారు.

పేదింటిలో మెరిసిన ఆణిముత్యం పోతురాజు

ప్రజాశక్తి-పిసిపల్లి

జొన్నలగడ్డ పోతురాజుకు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియన్ అసిస్టెంట్ పరీక్షల్లో జిల్లా స్థాయిలో 10వ ర్యాంకు సాధించాడు. గతేడాది ప్రభుత్వం జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు రాష్ట్ర వ్యాప్తంగా 670 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసింది 3.20 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రిలిమినరీ అర్హత సాధించిన వారి నుంచి 1:15 శాతం మందిని మెయిన్‌కు ఎంపిక చేశారు. జిల్లాలో 56 పోస్టులకు గానూ 950 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు. పోతురాజుకు 10వ ర్యాంకు వచ్చింది. 88.18 మార్కులు సాధించి 10వ స్థానంలో నిలిచారు.

పోతురాజు తండ్రి బాలఓబులేసు కేన్సర్‌తో మృతి చెందాడు. తల్లి కూరగాయలు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంది. పోతురాజు 10వ తరగతి వరకు పిసిపల్లిలో చదివాడు. ఇంటర్ కనిగిరిలో చేరాడు. కనిగిరి టాపర్‌గా నిలిచారు. డిగ్రీ కూడా కనిగిరిలో చదివాడు. జిల్లా స్థాయిలో 10వ ర్యాంకు సాధించిన పోతురాజును వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు బడుగు వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకుడు మహేష్, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు వేమూరి శ్రీను అభినందించారు.

పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు

- నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి మేయర్ వేమూరి

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

నగరంలో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నట్లు నగర ఇన్‌ఛార్జి మేయర్ వేమూరి సూర్యనారాయణ(బుజ్జి) తెలిపారు. మేయర్ గంగాడ సుజాత వ్యక్తిగత పనులపై విదేశీ పర్యనటలకు వెళ్లడంతో ఇన్‌ఛార్జి మేయర్‌గా వేమూరి బుజ్జి బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌ఛార్జి మేయర్ నగరంలో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. తొలుత నగరంలోని ఫిల్టర్‌బెడ్‌లు, డిపోవద్ద ఉన్న హిందూ స్మశాన వాటికను పరిశీలించారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లో నీటి నిల్వల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేసవిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తాగునీరు సరఫరా చేయాలని ఆదేశించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య మెరుగుదలకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆర్‌టిసి డిపో వద్ద గ్యాస్ క్రిమిలేయర్‌ను త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో

ఫిల్టర్ బెడ్స్‌ను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి మేయర్

పరిపాలన భవన్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. అధికారులను సమన్వయం చేసుకొని అన్నీ సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తనకు తెలియజేయాలని కోరారు. ఇన్‌ఛార్జి మేయర్ వెంట కార్పొరేషన్ ఇంజినీర్ కె.మాల్యాద్రి, డిఇఇ పద్మజ, తదితరులు ఉన్నారు.

హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు : ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

వైసిపి ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను హరించేలా తీసుకొచ్చిన జీవోనంబరు 1ని హైకోర్టు రద్దుచేయటం ఆ ప్రభుత్వానికి చెంపపెట్టుఅని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. హైకోర్టు జీవో నంబరు 1ని రద్దు చేయటంపై హర్షిస్తూ స్థానిక అమరావతి గ్రౌండ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ సభలు, సమావేశాలు,రాస్తారోకో నిర్వహించడాని వీలు లేదంటూ జీవో తీసుకురావడం దుర్మార్గమన్నారు. ప్రతిపక్షాల గొంతునొక్కేలా, హక్కులను కాలరాసేలా జీవోలు తీసుకురావటం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం తగిన మూల్యం

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉగ్ర

చెల్లించుకోక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాచమళ్ల శ్రీనివాసరెడ్డి, ముచ్చుమారి చెంచిరెడ్డి,తమ్మినేని వెంకటరెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు,షేక్ ఫిరోజ్, చింతలపూడి తిరుపాలు , నారాయణ పాల్గొన్నారు.

ప్రతి పేదవాడు సొంత ఇంట్లో ఉండాలి : వరికూటి

ప్రజాశక్తి -శింగరాయకొండ

జగనన్న కాలనీలో పట్టా మంజూరైన ప్రతి పేదవాడు సొంత గృహం కట్టుకొని ఉండాలన్నదే లక్ష్యమని వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇల్లు అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు అన్ని గ్రామాలకు చెందిన ప్రజలకు జగనన్న కాలనీల్లో పట్టాలు మంజూరు చేసినట్లు తెలిపారు. మొత్తం 3, 974 మందికి పట్టాలు మంజూరు చేసినట్లు తెలిపారు. జగనన్న లేఔట్‌లో గృహ నిర్మాణశాఖ ఇచ్చే డబ్బులతో

మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

పాటు మరో లక్ష రూపాయలు అదనంగా చెల్లిస్తే గృహాన్ని కట్టి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఇఇ పెరుగు శ్రీనివాస ప్రసాదు, మండల ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిపి కట్టా శోభారాణి వైస్ ఎంపిపి సామంతుల రవికుమార్ రెడ్డి , మండల పరిషత్ అభివద్ధి అధికారి షేక్ జమీఉల్లా, డిప్యూటీ తహశీల్దార్ తన్నీరు వెంకటేశ్వర్లు , గృహ నిర్మాణ శాఖ ఎఇ నాగరాజు , షేక్ రియాజ్ , సాంబశివరావు, ఎపిఒ సుధాకర్ , ఎపిఎం జయరాజు పాల్గొన్నారు.

గడపగడకూలో ఎమ్మెల్యే సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి

రెండో వార్డులో 'గడపగడపకూ'

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తిలోని రెండవ వార్డులో కౌన్సిలర్ గోగినేని అనసూయ,గోగినేని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకరబాబు,మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ కార్యక్రమాలు,ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. అర్హులైనందరికీ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఎవరికైనా అందకుంటే దరఖాస్తు పెట్టుకోవాలన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ ఛైర్మన్ చల్లా అంకులు,వైసిపి మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, వైసిపి పట్టణ అధ్యక్షుడు కె. శేఖరరెడ్డి, యూత్ అధ్యక్షుడు మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు తప్పెట బాబూరావు, భీమన వెంకటరావు, హరికృష్ణ, సుబ్బారావు పాల్గొన్నారు.

వాహన చోదకులకు కౌన్సిలింగ్

పామూరు : లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే క్రిమినల్ కేసులు తప్పవని సిఐ కె. శ్రీనివాసరావు హెచ్చరించారు. చార్జింగ్ బ్యాటరీ ఆటోలు ప్రయాణికులకు ఆటంకం కల్పిస్తూ వేగంగా నడుపుతున్న డ్రైవర్లకు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాలలకు వాహనమిస్తే యజమానిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా వాహనాలు నడుపుకోవాలని సూచించారు.

పథకాలపై దృష్టి సారించాలి

దర్శి : ప్రభుత్వ పథకాల పై అధికారులు దృష్టి సారించి గృహాలు, క్లీన్ ఆంధ్రప్రదేశ్, పాలవెలువ లాంటి పథకాలను త్వరతిగతి పూర్తి చేయాలని డిపిఒ నారాయణరెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కుసుమకుమారి అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా నిర్మాణ దశలో ఉన్న గృహాలను అధికారులు పరిశీలించి లబ్ధిదారులు త్వరతిగతిన పూర్తి చేసుకొనేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా 15 రోజులకు ఒకసారి ఒహెచ్ఎస్ఆర్, జిఎల్ఎస్ఆర్‌ను శుభ్రం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో డిఎల్‌పిఒ గుత్తా శోభన్‌బాబు, హౌసింగ్ డిఇ నిరీక్షన్‌రావు, పిఆర్‌డిఇ విఠల్‌రాథోడ్, సిడిపిఒ భారతి, ఎపిఎం విజయ, ఎపిఒ కళ్యాణి, ఎఇలు, అధికారులు పాల్గొన్నారు.

వికలాంగులు స్వశక్తితో ఎదగాలి

మార్కాపురం : వికలాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు నడవాలని, స్వశక్తితో జీవితంలో ఉన్నతంగా రాణించేందుకు ప్రయత్నం చేయాలని వైసిపి వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక విజయ థియేటర్ ఏరియాలోని పాశం బజారులో వైసిపి వికలాంగుట విభాగం పట్టణ ఉపాధ్యక్షుడు సయ్యద్ రహమాన్ ఏర్పాటు చేసుకున్న టివి, గ్రైండర్, ఫ్యాన్లు, మిక్సీ రిపేర్ షాపును గోపాల్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి వికలాంగుల విభాగం పట్టణ అధ్యక్షుడు నడికట్టు రమణారెడ్డి, రూరల్ అధ్యక్షుడు లుంజల శేఖర్,పట్ణ కార్యదర్శులు చముడూరి సురేంద్ర, విడుదల అశోక్, పట్టణ కోశాధికారి తుంబేటి వెంకటరమణ, అంధుల అసోసియేషన్ నాయకులు బోయపాటి వెంకటరామయ్య, పట్టణ నాయకుడు గజ్జల హరి తదితరులు పాల్గొన్నారు.

పింఛను.. జగనన్న చేదోడు రాలేదని..

- ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి ఎదుట బాధితుల ఏకరవు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలోని 11వ సచివాలయ పరిధిలోని 18వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి ఇంటింటి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు అర్హత ఉండీ కూడా ప్రభుత్వ పథకాలు అందలేని పలువురు ఎమ్మెల్యే ఎదుట ఏకరవు పెట్టారు. ఒకరు పింఛను రాలేదని... మరొకరు జగనన్న చేదోడు అందలేదని వాపోయారు. వార్డులోని షేక్ ఖాజాబికి వయసు పైబడింది. వృద్ధాప్య పింఛనుకు ఆమె అర్హురాలే. నివాసం ఉండేందుకు ప్రభుత్వ నిబంధనలకు మించి ఇల్లు ఉంది. ఆమెకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. అందరికీ వివాహాలు జరిగాయి. నివాసం ఉండే ఇల్లు కూడా ఇద్దరు కొడుకులకు చెరొక పోర్షన్ పంచి ఇచ్చింది. ఆ ఇల్లు తప్ప ఎలాంటి ఆస్తులు లేవు. ఆ ఇల్లు కూడా ఖాజాబి పేరుతో ఉంది. ఆమె పింఛనుకు దరఖాస్తు చేసుకోగా ఇల్లు నిబంధనలకు మించి ఉందని, నీకు పింఛను రాదని వాలంటీర్, సచివాలయ ఉద్యోగులు చెప్పారు. ఆమెకు ఉండేందుకు గూడు తప్ప మరో ఆదాయం లేదు. ఇద్దరు కుమారులు ఉన్నా ఎవరి సంపాదన వారిదే. పింఛను ఇస్తే ఆరోగ్య సమస్యలకు ఖర్చు వినియోగించుకుంటానని. పింఛను ఇప్పించాలని ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి వివరించింది. స్పందించిన ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి అక్కడే ఉన్న సచివాలయ ఉద్యోగులు, విఆర్ఒను ఆమెకు పింఛను వచ్చేలా చూడాలని ఆదేశించారు. ఆమె పేరుతో ఉన్న ఇల్లు ఇద్దరు కొడుకుల పేరున చెరొక పోర్షన్ రిజిష్టర్ చేస్తే పింఛను వస్తుందని అధికారులు సూచించారు. ఖాజాబి మాత్రం రిజిష్టర్‌కు డబ్బు లేదని సమాధానం చెప్పింది. అదే వార్డులో నివాసం ఉంటున్న షేక్ హస్మత్ అనే మహిళ అమీదా టైలరింగ్ సెంటర్ నడుపుతోంది. టైలర్లను ఆర్థికంగా ఆదుకునేందు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న చేదోడు పథకం ద్వారా రూ. 10వేలు అందించేలా చర్యలు తీసుకున్నారు. ఆ పథకానికి అర్హత ఉండీ కూడా తనకు అందలేదని హస్మత్ ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి వివరించింది. ఆ పథకం వచ్చేలా చూడాలని సచివాలయ ఉద్యోగులను ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి ఆదేశించారు. తొలుత ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డికి ఆ వార్డు కౌన్సిలర్ దూదేకుల కరిముల్లా ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, చాతరాజుపల్లి అంజమ్మ శ్రీనివాస్, కౌన్సిలర్లు మొఘల్ సిరాజ్‌తుల్లాబేగ్, కొత్త క్రిష్ణ, షేక్ చిన్న షెక్షావలి, షేక్ నాసర్‌వలి, దూదేకుల ప్రసాద్, దొడ్డా భాగ్యలక్ష్మి, టి.రంగలక్ష్మి, వై.నాగఅరుణ, కోఆప్షన్ సభ్యులు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, పఠాన్ అమీరుల్లాఖాన్, సయ్యద్ ఆబిదా మయూర్ ఖాశిం, మున్సిపల్ కమిషనర్ గిరికుమార్, డిఇ షేక్ సుభానీ, ఎఇ పి.ఆదినారాయణ, ఆర్ఒ బి.రంగారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ దూదేకుల నాగూర్‌వలి, వైసిపి నియోజకవర్గ నాయకులు కుందురు కృష్ణమోహన్‌రెడ్డి, వైసిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు తడికమళ్ల బాలసుబ్బారావు పాల్గొన్నారు.

పింఛను ఇప్పించాలని ఎమ్మెల్యేని కోరుతున్న వృద్ధురాలు

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయం (పిటిజి బాలుర)లో 2023-24 సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్న కన్వీనర్, ప్రిన్సిపల్ ఎం. చిట్టిబాబు తెలిపారు. మూడో తరగతిలో ప్రవేశానికి చెంచులకు 75 సీట్లు, ఎస్సీలకు 2, బీసీలకు 2, ఓసీలకు 1 సీట్లు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. నాల్గవ తరగతిలో 50, ఐదో తరగతిలో 63, ఆరో తరగతిలో 63, ఏడో తరగతిలో 10, ఎనిమిదో తరగతిలో 20, తొమ్మిదో తరగతిలో 47 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈ ఖాళీలను ఎస్‌టి చెంచుకులం విద్యార్థులచే భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి విద్యార్థులు జూన్ 5లోపు తమ దరఖాస్తులను అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ 8309462537 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. స్థానిక ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో మూడో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రవేశానికై ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ సురేష్‌బాబు తెలిపారు. ఆసక్తి కలిగిని విద్యార్థులు ఈ నెల 30లోపు పాఠశాలలో నేరు దరఖాస్తు అందజేయాలన్నారు. **పెద్దదోర్నాల :** మండల పరిధిలోని వై చెర్లోపల్లి (మల్లిఖార్జునపురం) లోనున్న ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ సతీష్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 25లోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

14న రాష్ట్రస్థాయి ఎడ్లపోటీలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

హనుమాన్ జయంతి సందర్భంగా మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో ఈ నెల 14న రాష్ట్రస్థాయిలో పాలపళ్ల సైజు ఎడ్ల పందాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు దమాం వెంకట సుబ్బయ్య, మండ్లా బాలకాశయ్య, నల్లబోతుల కాశీరాములు, రావిక్రింది పుల్లారావు, కొండూరి వెంకట నరసింహులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ. 30 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 20 వేలు, తృతీయ బహుమతిగా రూ. 10 వేలు, నాల్గో బహుమతిగా రూ. 5 నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

విగ్రహ ప్రతిష్టలో 'చింతలచెరువు'

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

మండల పరిధిలోని నందనవనం గ్రామంలో నాంచారమ్మ, పోలేరమ్మల విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు సూరిశెట్టి పెద్దకొండయ్య ఆధ్వర్యంలో రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి నారాయణ స్వామి, ఆలయ కమిటీ పెద్దలు రామకృష్ణ నాగబ్రహ్మం, నరసింహారావు, వెంకటనారాయణ, సుబ్బారావు, వైసిపి నాయకులు మూలే గోపాల్‌రెడ్డి, లింగారెడ్డి, అంజిరెడ్డి, శివారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

మార్కాపురం : పేద విద్యార్థులకు రెడ్డి సంక్షేమ సేవా సంఘం అండగా నిలుస్తోంది. చదువుల్లోనూ, క్రీడల్లోనూ ఆర్థికంగా ప్రోత్సాహాన్నిస్తోంది. చదువులకు, క్రీడలకు పేదరికం అడ్డురాకూడదనే లక్ష్యంతో రెడ్డి సంక్షేమ సేవా సంఘం నిర్వాహకులు పనిచేస్తున్నారు. మండల పరిధిలోని నాయుడుపల్లి గ్రామానికి చెందిన ఒంటేరు రాణి చదువులతో పాటు క్రీడల్లోనూ రాణిస్తోంది. అథ్లెటిక్స్‌లో 400 మీటర్లు, 1500 మీటర్లలో విజయం సాధించింది. ఒంటేరు రాణిని ప్రోత్సహిస్తూ రూ. 7వేల నగదును కోచ్ చిట్టిబాబు సమక్షంలో రెడ్డి సంక్షేమ సేవా సంఘం నియోజకవర్గ కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెన్నా వెంకటరెడ్డి, తిరుమలరెడ్డి రామిరెడ్డి, కుందూరు రమణారెడ్డి, చిట్టిరెడ్డి నరసింహారెడ్డి, గుంటక భాస్కర్‌రెడ్డి, కందుల బలరామిరెడ్డి, కుందూరు మల్లారెడ్డి, గోరంట్ల చిన్న వెంకటరెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- జరుగుమల్లి

టంగుటూరులోని రావూరి వారి కంపెనీలో ఈ నెల 15న యన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్ర బాబు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు,కార్యకర్తలతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ మండలంలోని తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి కొండపి నియోజకవర్గ కార్య నిర్వాహక కార్యదర్శి బత్తిన పూర్ణచంద్రరావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు ఎనిమిరెడ్డి రమేష్ రెడ్డి, పెదబాబు, కొమ్మాలపాటి కృష్ణ, దగ్గుమాటి సుబ్బారెడ్డి, చదలవాడ బ్రహ్మేంద్రం, గుండవనేని వెంకటేశ్వర్లు, మాధవ, చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, మక్కెన శ్రీనివాసరావు, వట్టిగుంట శివాజి పాల్గొన్నారు. **కొండపి :** టంగుటూరులో ఈనెల 15న నిర్వహిస్తున్న దివంగత ముఖ్యమంత్రి రామారావు శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని టిడిపి మండల అధ్యక్షుడు బొడ్డపాటి యలమందనాయుడు కోరారు.స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బి.యలమందనాయుడు మాట్లాడుతూ శతజయంతి ఉత్సవాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పోరూరి రవీంద్రబాబు

స్థల వివాదం పరిష్కారం

సిఎస్.పురం : మండల పరిధిలోని వి.బైలు గ్రామంలో రెండు కుటుంబాల మధ్య వివాదాస్పదంగా మారిన స్థల వివాదాన్ని ఎస్ఐ పి.అనిల్‌కుమార్ పరిష్కరించారు. ఇటీవల స్థల విషయంతో రెండు కుటుంబాల వారు ఘర్షణ పడి ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. అందులో భాగంగా ఎస్ఐ అనిల్ కుమార్‌కు శుక్రవారం గ్రామానికి వెళ్లి వివాదంగా మారిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామస్తులను విచారించారు. బాధిత కుటుంబాలకు చెందిన వారిని పిలిపించి పెద్దల సమక్షంలో రాజీ కుదిర్చారు. శాశ్వత పరిష్కారంగా హద్దులు ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాకానిని పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని వెన్నూరు గ్రామానికి చెందిన కాకాని శ్రీనివాసరావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఒంగోలు లోని ప్రకాశం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు ఈ విషయం గురించి తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి శుక్రవారం హాస్పిటల్‌కు వెళ్లి శ్రీనివాసరావును పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి శ్రీనివాసరావు ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాసరావు కుటుంబ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పొన్నలూరు మాజీ యంపిపి కొండ్రగుంట శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కథల పోటీలు

కొండపి : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా కొండపి గ్రంథాల యంలో శుక్రవారం విద్యార్థులకు పాటలు, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మొత్తం 16 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కూలి రేట్ల ఒప్పంద చర్చలు విఫలం

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ప్రస్తుతం రోజురోజుకు పెరుగుతున్న ధరలతో యజమానులు ఇస్తున్న కూలిరేట్లు కార్మికులకు కుటుంబాలు గడవడం కష్టమని, పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు రూ.350 కూలి ఇవ్వాలని సిఐటియు నాయకులు డికెఎం.రఫీ డిమాండ్ చేశారు. స్థానిక పారిశ్రామికవాడలో డిజైన్ స్లేట్ ఓనర్స్ అసోసియేషన్,డిజైన్స్ స్లేట్ వర్కర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో నూతన వేతన అగ్రిమెంట్, కూలి పెంపుదలపై శుక్రవారం చర్చలు జరిపారు. గతంలో ఇస్తున్న రూ.260 కూలిని రూ.285 పెంచేందుకు యజమానులు అంగీకరించారు. కార్మికులు అడిగిన మేర కూలి రేట్లు పెంచడానికి యజమానులు సిద్ధపడక పోవడంతో చర్చలు విఫలమయ్యాయి. ఈ చర్చల్లో యజమానుల తరపునవెన్న పోలి రెడ్డి, గుప్తా ప్రసాద్, యేర్వ వెంకట్ రెడ్డి, రమణ, యక్కలి కోటి, కందుల వేణు గోపాల్ రెడ్డి, పి.కాపరెడ్డి, బసిరెడ్డి, దూదేకుల చిన్న మస్తాన్, తిరుపతి రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి ,సురేంద్ర, శ్రీకాంత్ రెడ్డి, వర్కర్స్ తరపున సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం. రఫీ, యూనియన్ కార్యదర్శి పి.రూబెన్, ఎం.బాల శేషయ్య, టి.రాములు, ప్రకాశం, స్వప్న, శేషగిరి, కోటయ్య, పుల్లయ్య, శ్రీను, రవి, అంజి, మాబు, వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చర్చలలో పాల్గొన్న యూనియన్ నాయకులు, కంపెనీల యజమానులు

విద్యార్థులకు సన్మానం

గిద్దలూరు : 10వ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలలో ప్రతిభ చాటిన విద్యార్థులను శ్రీవిరాట్ విశ్వకర్మ అభివృద్ధి సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన మహేశ్వరుల వేదస్య, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరచి తిరుపతిలో ఐఐటిలో ప్రవేశం పొందిన అందే శ్రీవిద్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీ విరాట్ విశ్వకర్మ అభివృద్ధి సమితి అధ్యక్షుడు కాయల కోటిలింగాచారి, ఉపాధ్యక్షుడు పోలేపల్లి గోవిందయాచారి, ప్రధాన కార్యదర్శి బంగారు బాల బ్రహ్మచారి,కార్యదర్శి పాల్వాది నాగ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత జాబితా నుంచి

రైతుల భూములకు శాశ్వత విముక్తి: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

నిషేధిత భూముల జాబితా నుంచి వందేళ్ల తర్వాత రైతుల భూములకు శాశ్వతంగా విముక్తి కలిగిందని జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాషా తెలిపారు. చుక్కల భూముల రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశంలో జరిగింది. రైతులకు భూ హక్కు పత్రాల పంపిణీ రాష్ట్రవ్యాప్త కార్యక్రమాన్ని కావలి పట్టణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించగా రైతులు తిలకించేలా అధికారులు ప్రత్యేక ప్రసారానికి ఏర్పాట్లు చేశారు. తదుపరి జిల్లాలోని లబ్ధిదారులైన రైతులకు, ఏపీ లెజిస్లేటివ్ చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుతో కలిసి జిల్లా కలెక్టర్ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. చుక్కల భూముల జాబితాలో వందేళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 3,514 సర్వే నెంబర్లలోని 7,833.87 ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి శాశ్వతంగా విముక్తి కల్పించామన్నారు. బాపట్లలో 4,257 రైతు కుటుంబాలు లబ్ధి పొందుతాయన్నారు. బ్రిటీష్ కాలం నుంచి చుక్కల భూమి ఎవరిదో స్పష్టత లేదన్నారు. ప్రభుత్వానికి చెందినవా,.. ప్రైవేట్ వ్యక్తుల భూములా అనే విషయంలో సందిగ్ధత నెలకొందన్నారు. రైతుల సమస్యలను గుర్తించిన ముఖ్యమంత్రి ప్రత్యేక చట్టాన్ని తెచ్చారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాలతో రైతుల సమస్యలన్నీ ఇక శాశ్వతంగా పరిష్కారమయ్యాయని అన్నారు.

శాశ్వత భూహక్కు పత్రాలు అందిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఏపీ లెజిస్లేటివ్ చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

రైతుల భూ సమస్యలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శాశ్వతంగా పరిష్కరించారని ఏపీ లెజిస్లేటివ్ చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో సిఎం గొప్ప నిర్ణయాలు తీసుకున్నారని కితాబిచ్చారు. ఇలాంటి గొప్ప నిర్ణయాలు తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి రైతులంతా రుణపడి ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె లక్ష్మీశివజ్యోతి, కలెక్టరేట్ ఏవో సుశీల, రైతులు పాల్గొన్నారు.

మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం

ప్రజాశక్తి-వేటపాలెం

ఎరువులు, పురుగు మందులు ప్రి పొజిషన్ చేసుకోవచ్చునని మండల వ్యవసాయాధికారి తెలిపారు. వేటపాలెం మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశం రామన్నపేట రైతు భరోసా–2లో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల ఛైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఐటిసి ప్రాజెక్ట్ మేనేజర్ శాస్త్రి మాట్లాడుతూ స్థిరమైన వ్యవసాయం చేసేవారికి ఐటీసీ కంపెనీ వాళ్ళ తోడుగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తారని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు పాల్గొని వారి గ్రామంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు సమావేశంలో చర్చించారు. మండల స్థాయిలో చర్చించిన వివిధ అంశాలను జిల్లా స్థాయి కమిటీ దృష్టికి తీసుకువెళ్లాలని తీర్మానించుకున్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శర్మ, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ పల్లప్రోలు శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు జంగిలి రామారావు, పశు వైద్య అధికారి భాగ్యశ్రీ, ఐటీసీ గ్రామ సిరి ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస శాస్త్రి సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అధికారి



ప్రిన్సిపాల్ యేనోక్‌ను అభినందిస్తున్న ఐఆర్ఈఎఫ్ విద్యాసంస్థల అధినేత బిషప్ డాక్టర్ ఇమ్మానుయేలు రెబ్బా తదితరులు

ఎడ్యుకేషన్ విభాగంలో యేనోక్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-రేపల్లె: ఎడ్యుకేషన్ విభాగంలో రేపల్లె పట్టణానికి చెందిన ఐఆర్ఈఎఫ్ విద్యాసంస్థలలోని ఆర్‌సీ బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్న గొరక పూడి యేనోక్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. ఆంధ్ర లూథరన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్తేర్ సునీలా పర్యవేక్షణలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో సంపూర్ణ అక్షరాస్య కార్యక్రమంపై, బోధన, పరిపాలనా విభాగం వైఖరులపై ఆయన పరిశోధనలు నిర్వహించి ఇటీవల యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక కళాశాల ప్రాంగణంలో శుక్రవారం డాక్టర్ యేనోక్‌కు నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఐఆర్ఈఎఫ్ విద్యాసంస్థల బిషప్ డాక్టర్ ఇమ్మానుయేలు రెబ్బా ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఆర్‌సీ కళాశాలల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జాషువా రెబ్బా, ప్రవాసాంధ్రుడు జాన్ రెబ్బా, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలిపారు.

మొక్కజొన్న పంట నష్టాన్ని అంచనా వేయాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఇటీవల కురిసిన వర్షానికి పంట కోత అనంతరం దెబ్బతిన్న, మొలక వచ్చిన, రంగుమారి జొన్న, మొక్కజొన్న పంటను పరిశీలించి నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి మీరయ్య తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంట నష్టం అంచనాను త్వరితగతిన పూర్తిచేసి ఆయా రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించాలన్నారు. ఎంపిపి డివి లలితకుమారి మాట్లాడుతూ జరిగిన నష్టాన్ని పారదర్శకంగా నమోదు చేసి నిజమైన రైతుకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. జెడ్పిటిసి ఉదయ్ భాస్కరి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయటం జరిగిందని రైతులు వారి పేర్లను నమోదు చేసుకొని కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు మైత్రి, రజని, రత్నాకర్, నాయకులు మల్లేశ్వరరావు, బాలాజీ ఉన్నారు.

పంగులూరు పాఠశాలలో బూట్లు తనిఖీ చేస్తున్న ప్రవీణ్ ప్రకాష్

ముందస్తు ఎన్నికలు రావచ్చు

టిడిపి శ్రేణులు సిద్ధంగా ఉండాలి: మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు

ప్రజాశక్తి-వేమూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇప్పుడున్న పరిస్థితులు చూస్తుంటే ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని, కాబట్టి నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరు కష్టపడి పని చేసి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వేమూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సమావేశం తెనాలి మండలం చినరావూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్క ఆనందబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనంద్‌బాబు మాట్లాడుతూ హౌస్ మ్యాపింగ్ ఓటర్ వెరిఫికేషన్‌ను అలసత్వం వహించకుండా ఎంత తొందరగా అయితే అంత తొందరగా పూర్తి చేయాలని అన్నారు. ఈ నెల 15వ తేదీకి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 100 రోజుల మైలురాయి చేరుకుంటున్న సందర్భంగా జాతీయ తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు 175 నియోజకవర్గాల్లో సంఘీభావ పాదయాత్ర నిర్వహించాలని కోరారు. అందులో భాగంగానే వేమూరు నియోజకవర్గం చుండూరు మండలం యడ్లపల్లి గ్రామం ఎన్‌టీఆర్ విగ్రహం దగ్గర నుంచి వయా నడిగడ్డపాలెం మీదగా చుండూరు అంబేద్కర్ నగర్ దగ్గర గల అంబేద్కర్ విగ్రహం వరకు, ఉదయం 7 గంటలకు పాదయాత్ర మొదలవుతుందని అన్నారు. ఈ పాదయాత్రకు వేమూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సంఘీభావ పాదయాత్రని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేమూరు నియోజకవర్గం పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పంగులూరు

పంగులూరులోని జగనన్న విద్యా కానుక, మండల స్థాయి స్టాక్ పాయింట్‌ను రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న స్టాక్ పాయింట్‌ను ఆయన పరిశీలించి జగనన్న విద్యా కానుక ద్వారా వచ్చిన సామగ్రిని గురించి అధికారులను ప్రశ్నించారు. 3,926 జతల బూట్లు వచ్చాయని, 7,852 సాక్సులు కూడా వచ్చాయని అధికారులు చెప్పారు. అయితే తొమ్మిదో సైజు బూట్లు ఎన్ని వచ్చాయని విద్యాశాఖ అధికారులను ప్రశ్నించగా, ఆ సైజు బూట్లు రాలేదని అధికారులు తెలిపారు. తొమ్మిదో సైజు రాకపోతే ఆ సైజు కావాల్సిన పిల్లలకు ఏమిస్తారని ప్రవీణ్ ప్రకాష్ అధికారులను నిలదీశారు. వచ్చిన వాటిని పరిశీలన చేసి, ఏమేమి కావాలి, ఎన్ని కావాలి, అనే విషయమై ఉన్నతాధికారులకు తెలియజేయాలని, వచ్చిన వాటిని దుర్వినియోగం కాకుండా జాగ్రత్తగా ఉపయోగించి విద్యార్థులకు అందించాలని ప్రవీణ్ ప్రకాష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజె రామారావు, ఆర్జెడి వివి సుబ్బారావు, సీఎంఓ రజిని, మండల విద్యాశాఖ అధికారి కె నాగభూషణం, పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఏపిఎం జ్యోతి ప్రసాదు, జెవికె 4 టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చీరాల మెప్మా సిఎంఎం బదిలీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

చీరాల మెప్మా సిటీ మిషన్ మేనేజర్ (సిఎంఎం) కె రాణిని ప్రకాశం జిల్లా డిస్ట్రిక్ట్ ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్ యూనిట్ (డిపిఎంయు)కు బదిలీ చేస్తూ మెప్మా ఎండి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాపట్ల డిపిఎంయుగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్ సుబ్రహ్మణ్యంను చీరాల ఇన్‌చార్జి మెప్మా సిఎంఎంగా నియమిస్తూ ఆదేశాలు ఇచ్చారు.

స్టాక్ పాయింట్‌కు చేరిన బూట్లు

ప్రజాశక్తి -చిన్నగంజాం

జగనన్న విద్యా కానుక పథకంలో భాగంగా విద్యార్థులకు పంపిణీ చేసేందుకు 4,023 జతలు బూట్లు స్థానిక జిల్లా పరిషత్ స్కూల్ స్టాక్ పాయింట్ వచ్చినట్లు విద్యాశాఖాధికారి డి గంగాధర్ తెలిపారు. వీటిని మండలంలో ఉన్న 39 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉన్న 4,023 మంది విద్యార్థులకు పంపిణీ చేయాల్సి ఉందన్నారు.

నూతన ఆధార్ కేంద్రాలు మంజూరు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

చెరుకుపల్లి మండలంలో నూతనంగా ఆధార్ కేంద్రాలు మంజూరు అయ్యాయని మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి శ్రీనివాసరావు తెలిపారు. రాంబట్లపాలెం, గూడవల్లి గ్రామ సచివాలయంలో నూతనంగా ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామస్తులు, పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నూతన ఆధార్ నమోదు, తప్పులు సరిచేసుకోవడం, ఫోన్ నెంబర్ నమోదు తదితర మార్పులు చేసుకోవచ్చని ఆయన అన్నారు.

'ప్రైవేటు' పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-చెరుకుపల్లి

ప్రభుత్వం ఇటీవల కల్పించిన నూతన విద్యా హక్కు చట్టం ద్వారా ప్రవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో బి శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల మొదటి విడత పూర్తయిన నేపథ్యంలో, రెండో విడత ప్రవేశాల కోసం ఐదు సంవత్సరాల నుంచి 6 సంవత్సరాల పిల్లలు ఒకటో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. 15వ తేదీలోగా దరఖాస్తులను ఆయా గ్రామ సచివాలయాల్లో పూర్తి చేయాలని ఆయన కోరారు.

వధూవరులకు మాజీ మంత్రి ఆశీర్వాదం

ప్రజాశక్తి-వేమూరు

వేమూరు మండలం జంపని గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పాములపాటి వెంకట్రావు(లేటు) కుమారుని వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఆశీర్వదించారు. శుక్రవారం తెనాలిలోని రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో జరిగింది. ఈ వివాహ వేడుకలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబుతో పాటు వేమూరు మండలానికి చెందిన పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

బూతుమల్లి గ్రామంలో..

వేమూరు మండలం బూతుమల్లి గ్రామానికి చెందిన కన్నెగంటి రాధాకృష్ణ కుమారుని వివాహ కార్యక్రమంలో శుక్రవారం మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. బూతుమల్లి గ్రామంలోని వారి స్వగృహంలో జరిగిన ఈ వివాహ వేడుకలో నూతన వధూ వరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వేమూరు మండల, బూతుమల్లి గ్రామ పరిధిలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాయజ్ఞాన్ని జయప్రదం చేయాలని ర్యాలీ

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఆంధ్ర రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, రాష్ట్ర ప్రజల సంక్షేమం, శాంతి సౌభాగ్యాల కోసం విజయవాడలో చేపట్టిన చండీ మహాయజ్ఞంను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం భట్టిప్రోలులో ర్యాలీ నిర్వహించారు. ఎంపిపి డివి లలితకుమారి, జెడ్పిటిసి టి ఉదయ్ భాస్కరి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది. ముఖ్యమంత్రి పాల్గొంటున్న ఈ యజ్ఞంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నాయకులు మల్లేశ్వరరావు, బాలాజీ, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.



ఒంగోలుకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ మధు కిరణ్‌రెడ్డి కుమార్తె లాస్యప్రియ, శరత్‌ల వివాహ రిసెప్షన్ శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, చిర్ల జగ్గిరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంటరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ప్రజాశక్తి- ఒంగోలు

ఎస్‌సి,ఎస్‌టిలు ఐక్యంగా ముందుకు సాగాలి

దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు

ప్రజాశక్తి-పొదిలి

మాట్లాడుతున్న కరవాది సుబ్బారావు

ఎస్‌సి,ఎస్‌టిలు ఐక్యంగా ముందుకు సాగాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవాది సుబ్బారావు తెలిపారు. స్థానిక బ్రహ్మయ్య తోటలో మార్కాపురం నియోజకవర్గ దళిత హక్కుల పోరాట సమితి ప్రథమ మహాసభ మండల కన్వీనర్ గొంగటి ఏసురత్నం అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఎస్‌సి,ఎస్‌టిలు ఐక్యంగా ఆర్థికంగా రాజకీయంగా ఎదిగేందుకు ప్రయత్నించాలన్నారు. అందుకోసం రాజ్యాంగంలో కల్పించిన చట్టాలను వినియోగించు కోవాలన్నారు. ఉన్న చట్టాలను నిర్వీర్యం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత దళిత, గిరిజనులపై ఉందన్నారు. దళిత. గిరిజనులకు రక్షణగా ఉన్న చట్టాలను తుంగలో తొక్కి బానిసలుగా చేసేందుకు పాలకులు కుట్ర పన్నుట్లు తెలిపారు. రాజ్యాంగం ద్వారా ఎన్నిక కాబడిన దళిత. గిరిజన ఎమ్మెల్యేలు. మంత్రులు సైతం అగ్రవర్ణ పెత్తందారులకు తొత్తులుగా మారుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మార్కాపురం నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రావినూతల మరియదాసు, ప్రధాన కార్యదర్శిగా గొంగటి ఏసురత్నం, సహాయ కార్యదర్శులుగా వేము కోటేశ్వరరావు, వంకాయలపాటి నాగరత్న, ట్రెజరీగా జనుమాల రామస్వామి, కమిటీ సభ్యులుగా ఏడు మందిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి పందిటి మోహన్, ఉప్పలపాటి రామయ్య, లక్క బాలస్వామి, వేము కష్టవేణి, వంకాయలపాటి చిన మరియమ్మ, రావినూతల వెంకటేష్, పోతుపోగు ఇజ్రాయిల్ కొమ్ముల యలమంద, ఉప్పలపాటి ప్రసాద్. వంకాయలపాటి దాయన్న పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల...

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం

ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకుడు శ్రీరామ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరపాలక సంస్థలో పనిచేసే పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి అధికారులు, పాలకవర్గం చర్యలు తీసుకోని పక్షంలో ఉద్యమం తప్పదని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) నగర వర్కింగ్ సెక్రటరీ శ్రీరామ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుధ్య కార్మికులకు పనిముట్లు ఇవ్వడం లేదని, డబ్బాలు, దంతెలు, చీపుర్లు లేకుండా కార్మికులు పారిశుధ్య పనులు ఎలా చేయాలని ప్రశ్నించారు. సేఫ్టీ మెటీరియల్ ఇవ్వకుండా కార్మికులు చేత పనులు చేయిస్తున్నారన్నారు. నెలకోసారి మెడికల్ క్యాంపు నిర్వహించాల్సి ఉన్నా నిర్వహించడం లేదని చెప్పారు. జీవో నెంబర్ 07ద్వారా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు నెలకు రూ.15వేల వేతనం చెల్లించాల్సి ఉందన్నారు. ఈజీవో నగరపాలక సంస్థలో అమలు చేయకుండా కోవిడ్ కార్మికులకు నెలకు కేవలం రూ.12వేలు వేతనం చెల్లిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని చెప్పారు. కోవిడ్ కార్మికులను ఆప్కాస్‌కు పంపేందుకు కౌన్సిల్ ద్వారా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు వేతన సవరణ చేపట్టాలన్నారు. ఆరోగ్యం బాగాలేని కార్మికుల బదులుగా వారి కుటుంబ సభ్యులు పనిచేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబసభ్యులను విధుల్లోకి తీసుకోవాలని చెప్పారు. జీవో నెంబర్ 151 ప్రకారం ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే కార్మికులను స్కిల్డ్, సెమిస్కిల్డ్, అన్‌స్కిల్డ్ వర్కర్లుగా విభజించి అర్హతను బట్టి వేతన సవరణ చేయాలని కోరారు. కార్మికులకు అందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని, కోవిడ్ కార్మికులు రావాల్సిన జీతం బకాయిలు చెల్లించాలని కోరారు. మున్సిపల్ కార్మికులందరికీ జగనన్న హౌసింగ్ కాలనీలో మొదటి విడతలోనే ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్లు కట్టించాలని కోరారు. నగరంలో హౌస్ హోల్డ్ సర్వే నిర్వహించి జనాభా నిష్పత్తి ప్రకారం కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో దశలవారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి కె.శీనివాసరావు, నగర కార్యదర్శి యు.రత్నకుమారి, సిఐటియు నగర కార్యదర్శి టి.మహేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీరామ శ్రీనివాసరావు

సిఎంను కలిసిన బూచేపల్లి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టర్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మర్యాద పూర్వకంగా కలిశారు. చుక్కల భూముల చిక్కులకు శాశ్వత పరిష్కారం కార్యక్రమాన్ని నెల్లూరు జిల్లా కావలిలో ప్రారంభించేందుకు సిఎం శుక్రవారం వచ్చారు. హెలీప్యాడ్‌లో బూచేపల్లి వెంకాయమ్మ సిఎం జగన్మోహన్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

విఆర్‌ఒ సత్యానందంపై దాడి సరికాదు

విఆర్‌ఎల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు వివేకానంద

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మాట్లాడుతున్న పాలడుగు వివేకానంద

వెలిగండ్ల విఆర్‌ఎ తాతపూడి సత్యానందంపై దాడి చేయటం సరికాదని, దాడిని చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఏపి విఆర్‌ఎల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు వివేకానంద డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పాత్రికేయుల సమా వేశంలో విఆర్‌ఎ తాతపూడి సత్యానందంపై జరిగిన దాడిని ఖండించారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ వెలిగండ్లలో మాదిగ మన్యం మూడు ఎకరాలు గొరిగె ప్రసాద్ ఆక్రమించి తన అవసరాల కోసం ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. అందులో విఆర్‌ఎ తాతపూడి సత్యానందానికి భాగం ఉందన్నారు. తన భాగం తనకు ఇవ్వాలని గురువారం భూమిలోనికి వెళ్ళగా గొరిగె ప్రసాద్ కర్రలతో దాడి చేశారన్నారు. ఈ దాడిలో తాతపూడి సత్యానందంకి గాయాలయ్యాయని, ఒక ఎముక విరిగినట్లుగా డాక్టర్లు చెబుతున్నారన్నారు. సత్యానందం ప్రస్తుతం ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడన్నారు. భూ సమస్య ఉన్నప్పుడు కోర్టు ద్వారా పరిష్కారం చేసుకోకుండా ఈ విధంగా దాడి చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ ఘటనకు బాధ్యుడైన గొరిగె ప్రసాద్‌పై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్, రెవెన్యూ విభాగాలు ఈ కేసుకు సంబంధించి వెంటనే విచారణ చేపట్టి మాదిగ మాన్యం మూడు ఎకరాల భూమి ఎవరిదనేది తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. సంఘ నాయకులు ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌కి వెళ్లి తాతపూడి సత్యానందాన్ని పరామర్శించినట్టు తెలిపారు. అతని భార్య తమకు న్యాయం చేయాలని రోధిస్తుందన్నారు. ఈ సమస్యపై అధికారులు, పోలీసులు వెంటనే జోక్యం. చేసుకుని పరిష్కరించాలని కోరారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గంటెనపల్లి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు పూర్ణకంటి యాకోబు తితరులు పాల్గొన్నారు.

8 గృహాలకు రూ. 45 లక్షల ఖర్చా..!

ఆశ్చర్యం వ్యక్తం చేసిన కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు పంచాయతీ పరిధిలోని ఆలకూరపాడు రోడ్డులోని జగనన్న లే అవుట్ లో మౌలిక వసతుల కోసమే ప్రభుత్వం రూ. 45 లక్షలకు పైగా ఖర్చు చేసిందని, ఇక్కడ కేవలం 8 గృహ నిర్మాణాలు మాత్రమే పూర్తి కావడం ఏమిటని కలెక్టర్ దినేష్ కుమార్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆలకూరపాడు రోడ్డులోని జగనన్న లేఅవుట్ వద్ద వివిధ శాఖల అధికారులు, గృహ నిర్మాణ లబ్ధిదారులతో కలెక్టర్ సమీక్ష శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టాలు ఇచ్చి 2 సంవత్సరాల పూర్తయినప్పటికీ ఇంకా ఇళ్ల నిర్మించుకోకపోవడానికి కారణం ఏమిటని కలెక్టర్ లబ్ధిదారులను ప్రశ్నించారు. లే అవుట్‌లో మొత్తం 282 ప్లాట్లు కేటాయిస్తే 128 గృహాలను గృహ నిర్మాణ శాఖ ద్వారా ప్రభుత్వ మంజూరు చేసిందన్నారు. వీటిలో ప్రారంభం కానివి 1, బేస్ మెంట్ లెవల్ లో 67, బేస్ మెంట్ పూర్తయినవి 50, రూఫ్ లెవెల్ 1, పూర్తయిన గృహాలు 8గా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు గృహ నిర్మాణాలకు నీటి సమస్య అధికంగా ఉందన్నారు. బేస్మెంట్ లెవల్ లోనే 5 ట్యాంకర్ల నీటిని ఒక్కొక్కటి రూ.1200 లెక్కన కొనుగోలు చేసి నిర్మించుకున్నట్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. నీటి సమస్యను తీర్చేందుకు తాము సిద్ధమే కానీ... ఈ నెల 20లోపు గృహాల నిర్మాణం ప్రారంభించని పక్షంలో సదరు పట్టాలను రద్దుచేసి వేరే వాళ్లకు ఇచ్చేస్తామని కలెక్టర్ సున్నితంగా హెచ్చరించారు. అనంతరం జగనన్న కాలనీలోని నిర్మాణ మెటీరియల్, ఇతర వసతులను కలెక్టర్ దినేష్ కుమార్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఇఇ ప్రసాద్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి నారదముని, తహశీల్దార్ కొల్లిబోయిన సంజీవరావు, ఎంపిడిఒ రత్నజ్యోతి, ఎపిఎం హనుమంతరావు, ఎపిఒ సుభాషిణి, ఎఇలు పఠాన్ రియాజ్, కోట శ్రీహరి, సుబ్బారావు, రామకష్ణ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.